జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 24 మార్చి 2026 | సంపుటి: 19 | సంచిక 13 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , చైత్ర మాసము , తిథిషష్టి - 16:10:23 వరకు నక్షత్రంరోహిణి - 19:05:40 వరకు కరణంతైతిల - 16:10:23 వరకు, గర - 26:59:39 వరకు పక్షంశుక్ల యోగంప్రీతి - 09:06:55 వరకు, ఆయుష్మాన్ - 30:01:38 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం**
**దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం**

న్యూఢిల్లీ,మార్చి23(ప్రజాజ్యోతి): నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం


మిగతా1 2లో..

## ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన

**తగ్గిన క్రూడాయిల్ ధరలు.. పెరిగిన పసిడి**

వాషింగ్టన్,మార్చి23(ప్రజాజ్యోతి): అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం

మిగతా 2లో..



## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

**యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు**
**లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి**



న్యూఢిల్లీ,మార్చి23(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలు గా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా

మిగతా 2లో..

# అడ్డంకులు సృష్టించొద్దు

**హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి**

- మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం
- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు.. మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసన మండలిలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మార్చి23: ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ,

మిగతా 2లో..

"మన నగరం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా మానవ తప్పిదాలే. రవాణాలో రోడ్లు, రైల్వే, ఎయిర్ పోర్ట్ వంటివి కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణను మూడు జోన్లుగా విభజించడం జరిగింది. క్యూర్, ప్యూర్, రేర్‌గా చేసుకున్నాం. అత్యధికంగా జనాభా వినియోగిస్తున్న మెట్రోను విస్తరించే దిశగా వెళ్తున్నాం"
-రేవంత్ రెడ్డి, సీఎం

# గిగ్ వర్కర్లకు సంక్షేమ బిల్లు

- మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం
- అడ్వకేట్స్ రక్షణకు చట్టం రూపకల్పన
- సిఎం రేవంత్ అధ్యక్షతన కేబినేట్ భేటీ
- పలు బిల్లులపై చర్చించిన మంత్రివర్గం

హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): ఈ అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టా÷-లసిన మొత్తం 10 కీలక అంశాలపై కేబినేట్‌లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సభలో ప్రవేశపెట్టాల్సిన మూడు ముఖ్య బిల్లులపై కేబినెట్ సభ్యులు సమగ్రంగా చర్చించారని సమాచరం. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. రాష్ట్రంలో సుమారు 3 నుంచి 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం చేకూరేలా ఈ బిల్లును రూపొందించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లులో గిగ్ వర్కర్లకు

మిగతా 2లో..

## తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

**కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టు విచారణ**

న్యూఢిల్లీ,మార్చి23(ప్రజాజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ పొడిగింపునకు



సంబంధించి అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, సీట్లు వృథా కాకుండా చూడాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. సీట్ల భర్తీ కౌన్సెలింగ్

మిగతా 12లో..

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

**ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాం**
**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**

హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

మిగతా 12లో..

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం

- బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?
- అక్రమాలు జరిగాయన్న హరీష్ రావు
- హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి ఉత్తమ్
- బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో మాటల యుద్ధం



హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. 'బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా? నాఫెడ్‌కు అనుమతి

మిగతా 2లో..

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన

మిగతా 2లో..

## ఆరు గ్యారెటీలకు చట్టబద్ధత..

- అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బీఆర్ఎస్ నోటీసు
- పెన్షనర్లను వేధిస్తున్న ప్రభుత్వం
- వారి బకాయల చెల్లింపులో నిర్లక్ష్యం

**అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్**



హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు

మిగతా 2లో..

## రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించండి

**ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం**
**తక్షణం కోర్టు ముందుకు రావాలని ఆదేశం**

హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే

మిగతా 12లో..

## దానం నాగేందర్ వ్యవహారంపై విచారణ

**నోటీసులు జారీచేసిన హైకోర్టు**

హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దానం నాగేందర్ పార్టీ

మిగతా 12లో..

## నేడు ప్రపంచ టిబి దినోత్సవం

- వాకథాన్‌లో ప్రజలో చైతన్యానికి కృషి
- నాపా ఆధ్వర్యంలో నేడు కెబిఆర్ పార్క్‌లో కార్యక్రమం
- వ్యాధిపట్ల ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపు



హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): మాయమైందనుకున్న క్షయ వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది. చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. కేంద్రప్రభుత్వం కట్టడి చర్యలు తీసుకుంటున్నా, ప్రజల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ వ్యాప్తిం చెందుతోంది. వ్యాధి బారిన పడ్డవారు సరిగా గుర్తించకపోవడం, వైద్యుల సలహాలు పాటించక పోవడం, సరైన చికిత్స తీసుకోక పోవడం వంటి కారణాలతో మళ్లీ వ్యాప్తి చెందుతోంది. ఈ క్రమంలో సామాజిక బాధ్యతయగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంగా ఏర్పడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు.

మిగతా 12లో..

# సంపాదకీయం

## క్షయతో మూడు నిముషాలకో ఇద్దరు మృతి

ఒకప్పుడు క్షయవ్యాధి సోకితే మరణం తప్పేది కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం, సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు ఇవ్వడం వల్ల, చికిత్స చేయడం వల్ల క్షయను అరికట్టడం సాధ్యమయ్యింది. అయినా నేటికీ మూడు నిముషాలకో ఇద్దరు క్షయవ్యాధితో మరణిస్తున్నారన్న గణాంకాలు చూస్తే భయమేస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యంతో పాటు, సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వంటి కారణాలని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24న పాటిస్తారు. టీబీ వ్యాధిపై అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1882లో డా. రాబర్ట్ కోచ్ టీబీ బాసిల్లస్ క్షయ వ్యాధి కారకంను కనుగొన్న రోజుగా దీనిని జరుపుకుంటారు. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటిసారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 100 సంవత్సరాలైన సందర్భంగా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించింది.భయంకరమైన అంటువ్యాధైన టీబీ దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు దేశవ్యాప్తంగా 1000మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. క్షయవ్యాధి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు మరియు బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. 6–9 నెలల పాటు డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడితే ఇది పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది. క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే ఈ వ్యవధి వ్యాప్తికి మూలం. నిజానికి ప్రస్తుతం క్షయకు అత్యాధునిక చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రజలు క్షయ గురించి ఇంకా అవగాహన కలిగించకోవడం లేదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకుంటే అటు వ్యక్తికే గాకుండా, సమాజా ఆరోగ్యానికి కూడా దోహదపడ్డవారు అవుతారు. 2016లో 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకగా 2.5 లక్షల మంది పసివాళ్లు ప్రాణాలు కోల్పోయారంటే నమ్మశక్యం కాని విషయం. ప్రపంచం లోనే వందలో 4వ వంతు జనాభాలో క్షయ బ్యాక్టీరియా ఉందంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపించి ఉందో అర్థం చేసుకోవచ్చు. టిబి వ్యాధిగ్రస్తులు మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ భారత్ లో విస్తరిస్తున్న అనేక వ్యాధుల్లో ఈ క్షయ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించినదే అయిన చర్మం నుంచి మెదడు వరకు శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. క్షయ వ్యాధి ముఖ్యంగా శ్వాసకోశాన్ని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికీ ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ చుక్కల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది.క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండడం మరియు కఫంలో రక్తం వంటి లక్షణాలు 2 వారాలకు మించి ఉంటాయి. ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడమే కాక, నొప్పి మరియు ప్రభావిత ప్రాంతాల్లో వాపు వస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి సమస్యలు కూడా సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి తుగ వైద్యసూచనలు పాటించాలి. లేకుండే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారలోపం మరియు సిలికోసిస్ ఉన్నవారి లోనూ ఈ వ్యాధి సోకుతుంది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు ఎనిమిది దేశాల్లో ఉన్నాయి, భారత్ అగ్రస్థానంలో ఉంది. క్షయ నివారణ మరియు నివారించదగినదని వైద్యులు అంటున్నారు. వ్యాధి ఉన్న వ్యక్తి యొక్క అంటువ్యాధి అతను లేదా ఆమె గాలిలోకి విడుదల చేసే ట్యూబర్‌కిల్ బాసిల్లి సంఖ్యకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అనేక ట్యూబర్‌కిల్ బాసిల్లిని బహిష్కరించే వ్యక్తులు తక్కువ లేదా బాసిల్లిని బహిష్కరించే రోగుల కంటే ఎక్కువ అంటువ్యాధి కలిగి ఉంటారు.సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే, సక్రమంగా మందులు వాడితే వ్యాధిని అదుపు చేయవచ్చని అంటున్నారు. జీవనశైలి మార్పులు కూడా ఈ కాలంలో వ్యాధిని నిర్మూలిం చడంలో సహాయపడతాయి. క్షయ అనేది చికిత్స చేయగల మరియు నయం చేయగల వ్యాధి. సమయానికి మందులను తీసుకోవడం వల్ల రక్తంలో ఔషధం యొక్క ఖచ్చితమైన ఏకాగ్రత స్థాయిని కొనసాగించవచ్చు. వ్యాధికారక క్రిములను చంపడానికి ఇది చాలా అవసరం. చాలా మంది రోగులు చికిత్స కొనసాగుతుండగా మెరుగైన పరిస్థితి కనిపించడంతో, అటువంటి రోగులు కొన్నిసార్లు చికిత్స చేస్తున్న వైద్యుడిని సంప్రదించకుండా వారి స్వంత చికిత్సను ఆపడానికి ఆకర్షితులవుతారు. ఇది హానికరం మరియు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి అభివృద్ధికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానం చేయవద్దు. మీరు మందులు తీసుకునేటప్పుడు ధూమపానం చేస్తే, అది మీ చికిత్సను ప్రభావితం చేయవచ్చని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికిత్సకు కొన్ని మందులు కాలేయానికి హాని చేస్తాయి. వీటిని తీసుకుంటూ మద్యం సేవించడం వల్ల కాలేయంపై అదనపు భారం పెరుగుతుందని అంటున్నారు. ఏదేమైనా చికిత్స చేయించుకోవడం, వ్యాధిని గుర్తించడం, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడడం వంటి వాటి వల్ల వ్యాధిని అరికట్ట వచ్చని అంటున్నారు. కేంద్రం కూడా క్షయ నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

మొదటిపేజీ తరువాయి..

మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు.

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

మొదటిపేజీ తరువాయి..

భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు.

## గిగ్ వర్కర్లకు సంక్షేమ బిల్లు

మొదటిపేజీ తరువాయి..

సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కోర్ అర్బన్ యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ కొనసాగినట్లు సమాచారం. మొత్తంగా ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.విద్వేషపూరిత ప్రసంగాలు.. నేరాల నిరోధక బిల్లు, తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో స్వాధీన పక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం తరఫున లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించింది. కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందిజ. నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యత క్యాబినెట్ సబ్‌కమిటీకి అప్పగించింది. రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహా, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు.

## ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం

మొదటిపేజీ తరువాయి..

ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. ఫిలిప్పైన్ తో కు బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఫిలిప్పిన్స్ తో ఒప్పందం కోసం గార్గ్ ను అడ్వైజర్ గా పెట్టుకున్నారని.. గార్గ్ అనే వ్యక్తి ఈడీ ,సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నాడని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో 7 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యం .. ఏడాదిగా ముక్కిపోయాయని విమర్శించారు. బియ్యం ఎగుమతితో సివిల్ సప్లైస్ శాఖకు కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు. బియ్యం ఎగుమతిపై హౌస్ కమిటీ వేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హరీశ్ వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ఫిలిప్పిన్స్ తో బియ్యం ఎగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు.

## ఆరు గ్యారెటీలకు చట్టబద్దత..

మొదటిపేజీ తరువాయి..

అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు



పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా , కల్వకుంట సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు రూ. 700 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పి , ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారురని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

### హామీల అమలులో చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ ప్రభుత్వం

### మధుసూధనాచారి విమర్శలు

హైదరాబాద్,మార్చి23(ప్రజాజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలే కేంద్ర బిందువుగా అసెంబ్లీలో చర్చ జరగాలని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటనేది చూడకుండా ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. శాసనమండలి, శాసనసభను వాయిదా వేసుకుంటూ పోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికార పక్షాన్ని నిజాయితీగా ప్రశ్నించాలని అనుకుంటున్న పార్టీలు తమతో కలిసి రావాలని మధుసూదనాచారి పిలుపునిచ్చారు. హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని నిజాయితీ, చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులు అప్పుల్లో కూరుకుపోకుండా పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్న ఆలోచన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హామీల అమలుపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నామని మధుసూదనాచారి తెలిపారు.

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..

కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.
ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎ÷–లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియాలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది ఎన్నికల పక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

## ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన

మొదటిపేజీ తరువాయి..

జారీ చేయడం.. ప్రతిగా తాము హర్మూజ్ పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ హెచ్చరికలతో యుద్ధం ఎటు వెళ్తుందోనన్న భయాలు నెలకొన్నాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమనగా.. బంగారం, వెండి ధరలు భారీగా క్షీణించాయి. అయితే అనూహ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కాల్పుల విరమణ ప్రకటించారు.

## అడ్డంకులు సృష్టించొద్దు



మొదటిపేజీ తరువాయి..

జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి.

**In the Court of District Consumer Disputes Redressal Commission at Adilabad (T.S)**
EA. No. 43 /2025
Between:
Chandra Bhaga Sippiwar ... DHR
And
Abhivrudhi chit Funds Private Limited & Others ..... JDR's
To
**1.ABHIVRUDHI CHIT FUNDS PRIVATE LIMITED,** Represented by its Foreman,
Branch Office: 1-2-69/2, First Floor, M.S. Tower, Opp: Bus Depot, Nirmal, Dist: Nirmal-504106.
2.ABHIVRUDHI CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Managing Director,
Are Sudhakar, Regd. Office:1-2-69/2, First Floor, M.S. Tower, Opp: Bus Depot, Nirmal, Dist: Nirmal-504106.
Whereas, the Appellant has instituted a execution petition for the recovery against you for Rs.7,57,788/-
You are here by required to appear to in this court on 08-04-2026 at 10-30 A.M in person or by pleader duly instructed able to answer all material question relating to the above proceeding.
Also take notice that in default of your appearance on the aforesaid day these issues will be settled and the petitioner hear and determined in your absence. You shall also bring with you or send by your pleader any document on which intend to rely in support of defence, you are required to file a counter in the court.
Dt: 23-03-2026

Sd/-
**Bipin Kumar Patel**
Advocate for the Plaintiff,
ADARSH Building, N.H.No.7,
Adilabad **Mobile: 09963934500**

## స్పర్శలేని మచ్చలు ఉంటే

# వైద్య సిబ్బందికి తెలపండి

• కుష్టు నివారణ కార్యక్రమంలో జిల్లా అధికారి డా. సుధాకర్ నాయక్




**మంచిర్యాల, 23, మార్చి (ప్రజా జ్యోతి) :** స్పర్శలేని మచ్చలు కనిపించిన వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని జిల్లా కుష్టు నివారణ కార్యక్రమ అధికారి డా.సుధాకర్ నాయక్ సూచించారు. మంచిర్యాల పురపాలక సంస్థ పరిధిలోని ముల్కల్ల డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన వ్యాధి నిర్ధారణ ఉద్యమ సర్వే కార్యక్రమాన్ని కార్పొరేటర్ బియ్యాల త్రివేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. సుధాకర్ నాయక్ మాట్లాడుతూ, కుష్టు వ్యాధి ఇంకా సమాజంలో కొంతమేర కొనసాగు తున్నదని, దీనిని తొందరగా గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది మీ ఇళ్లకు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సర్వే ప్రధాన లక్ష్యం గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి ఉచితంగా చికిత్స అందించడమని తెలిపారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతతో పనిచేసి అనుమానిత కేసులను గుర్తించి వెంటనే జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించి కుష్టు వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డెమో వెంకటేశ్వర్లు, డీపీఎంఓ రాఘవయ్య, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, హెచ్ఈఓ రఘుపతి, ఎంఎల్‌హెచ్‌పీ డా.సాయి ప్రసన్న, ఏఎన్ఎంలు పద్మ, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని ఔట్సోర్సింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఫిర్యాదు



**మంచిర్యాల, 23,మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఔట్సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధులను సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు చెల్లించలేదని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు సమర్పించారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో కొన్ని నెలల పాటు కార్మికుల జీతాల నుంచి కోతలు వేసినా, ఆ మొత్తాలను ఈపీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో జమ చేయలేదని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే 27-09-2025న జిల్లా బీసీ వెల్ఫేర్, జిల్లా ఉపాధి కల్పన, లేబర్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఐదు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జిల్లా అవుట్సోర్సింగ్ ఎంపానల్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉన్నందున, ఈ అంశంపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే కార్మికుల ఖాతాల్లో బకాయి ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధులను వెంటనే జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## అనిల్ అజెండానే అభివృద్ధి

- అనిల్ బోథ్‌కి అండగా ఉండగా అభివృద్ధి దండిగా
- ఎమ్మెల్యే అనుమతులతోనే అభివృద్ధి పనులు
- అన్ని సమస్యలపై అనిల్ అలుపెరుగని పోరాటం
- బోథ్ ప్రాంత ప్రతి సమస్యపై అసెంబ్లీలో ఎమ్మెల్యే తన గళం
- మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్




**బోథ్, మార్చి 23 (ప్రజా జ్యోతి) :** బోథ్ ప్రాంత అభివృద్ధి అజెండానే అనిల్ జాదవ్ అభిమతమని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోథ్‌కు ఫైర్ స్టేషన్ మంజూరు కావడంలో ముమ్మాటికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషితోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చి అబద్ధాలు చెప్పుకుంటు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా పిలవబడే ఆడే గజేందర్‌కు ఫైర్ స్టేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని విమర్శించారు.ఖబర్దార్ గజేందర్ అబద్దాల కంటూ ఒక హద్దు ఉంటుంది. అని హితవు పలికారు. అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోవడంలో కాంగ్రెస్ పార్టీకే చెల్లిందని అన్నారు. పలుమార్లు రాష్ట్ర అసెంబ్లీలో బోథ్ సమస్యలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో ప్రస్తావించడం కాంగ్రెస్ నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు. సంబంధిత మంత్రులతోపాటు ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లడంతోనే బోథ్‌కు ఫైర్ స్టేషన్ మంజూరు అయ్యిందని అన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన మీకు బిఆర్ఎస్ ను ఎమ్మెల్యేను విమర్శించే నైతిక అర్హత లేదని అన్నారు. మూడు విడుతలుగా రైతు భరోసా దాదాపు 24 వేల కోట్లు రైతుల డబ్బులు ఎగ్గొట్టిన ఘనత మీది. పించన్ల పెంపుదల ఊసే లేదు.కౌలు రైతులకు ఇస్తానన్న 12000 లేవు. ఆరు గ్యారంటీల అమలు గాలికి వదిలేసారు అని,మీరా మాకు చెప్పేది అని విమర్శించారు. ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందని అక్కసుతో అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. మీకు చేతనైతే మీ మంత్రులు, ముఖ్యమంత్రి తో మాట్లాడి బోథ్ రెవిన్యూ డివిజన్ తెప్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మినీ స్టేడియం మంజూరు చేయించాలని డీఎస్పీ ఆఫీస్ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. మీకు పనులు చేయడం చేతకాదు కానీ ఒకరు చేసిన పనులు మేము చేసాము అని చెప్పుకోవడం మాత్రం బాగా వచ్చు అని విమర్శించారు...

ఎమ్మెల్యే లెటర్ లేనిదే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆమోదం లభించదనే కనీస కామన్ సెన్స్ లేని వీరు నాయకులా అని ప్రశ్నించారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోండి గ్రామాల్లోకి వెళితే ప్రజలు తరిమికొట్టే రోజులు వచ్చాయి.వచ్చే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలలో జరిగేది అదే అని జోస్యం చెప్పారు. గత ఎన్నికలలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 76,000 పై చిలుకు మెజారిటీతో విజయదుందిబి మోగిస్తే ప్రత్యర్థిగా ఉన్న ఆడె గజేందర్ కు వచ్చిన ఓట్లు ఎన్ని కేవలం 32వేలు మాత్రమేనని ఎద్దేవా చేశారు.ఆ విషయం మరిచి పోయారా అని ప్రశ్నించారు. గజేందర్ ను ప్రజలు తిరస్కరించారని మళ్లీ అబద్ధపు ప్రచారాలు చేస్తే వచ్చేసారి ఆ మాత్రం ఓట్లు కూడా రావని హెచ్చరించారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకొని నిజాలు మాట్లాడాలన్నారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ద్వారానే జరుగుతుందని అది ఫైర్ ఇంజన్ ఏర్పాటుతో మరొకసారి రుజువైందని అన్నారు. రాబోవు రోజుల్లో బోథ్ సమస్యల పట్ల అలుపెరుగని పోరాటం చేస్తామని అభివృద్ధి సాధించింతవరకు విశ్రమించేది లేదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కన్వీనర్ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్ ,బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, రూప్చంద్,విడిసి చైర్మన్ పోతన్న, గంగమల్లు,రవీందర్,సంజీవ్,రమణ గౌడ్, సోమేష్, రఫీ, రాజు,రమణ, ఇష్తేకర్, సురేందర్ యాదవ్ బీ ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలి







### మంచిర్యాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు

**మంచిర్యాల, 23, మార్చి (ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పాత మంచిర్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వారం రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ఘనంగా ముగిసింది. శిబిరం చివరి రోజున విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా దేవాలయానికి ర్యాలీగా వెళ్లి పరిసరాలను శుభ్రపరిచారు. దేవాలయ పరిసర ప్రాంతాల్లోని నివాసాల్లో సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టారు. మధ్యాహ్నం నిర్వహించిన ఈ సమావేశంలో మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు చెందిన విజయ భ్రూణ హత్యలు, బాలికా వివాహాలపై అవగాహన కల్పించారు. ఆమె ప్రసంగం విద్యార్థులను చైతన్యపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాళవి మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎంఈఓ మాళవి, విజయలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డా. సుదిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. ఎం. కుమారస్వామి, డా. కె. రాజయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ జె.మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి






### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 23,మార్చి (ప్రజా జ్యోతి) :** 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సమగ్రంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షల కోసం మొత్తం 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, సరిపడా వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియామకం కూడా చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దొరల అహంకారాన్ని అణిచి,

# బీసీల రాజ్యాధికారం సాధించితీరుతాం




- బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్..
- జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిరసన

**మంచిర్యాల, 23, మార్చి (ప్రజాజ్యోతి) :** బీసీలను కాంగ్రెస్ సర్కారం మోసం చేస్తున్నదని, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. టీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, మహేష్ వర్మ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడంపై తీవ్రంగా విమర్శించారు. ఆ రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని కోరారు. శాసన మండలి ఆమోదం లేకుండా ఖర్చు చేసిన ప్రజా ధనంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసు కోవాలని, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేయాలని అన్నారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన నిధులు తక్కువగా ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ సమాజం అన్నింటిని గమనిస్తోందని, రానున్న రోజుల్లో దొరల అహంకారాన్ని అణిచి బీసీల రాజ్యాధికారం సాధించితీరుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పుట్ట లావణ్య, గుమ్ముల శ్రీనివాస్, వేముల అశోక్, పడాల శివతేజ, దాస్యపు దీపక్, ఎండి లతీఫ్, సీపతి సాయి కుమార్, భీమిని రమేష్, బూర రవీందర్, దొబ్బల శంకర్, గనవేని నగేష్, బొంగోని విద్యాసాగర్, అడిచెర్ల రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ సవరణకు ప్రధాన మంత్రికి

# కోల్ రిటైర్డ్ ఉద్యోగుల సమగ్ర విజ్ఞప్తి

**మంచిర్యాల, 23,మార్చి (ప్రజాజ్యోతి) :** కోల్ ఇండియా లిమిటెడ్ , దాని అనుబంధ సంస్థలు, అలాగే సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లకు చెందిన పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ పెన్షన్ సవరణ కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కి సమగ్ర విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఒక విస్తృతమైన అభ్యర్థన సోమవారం పత్రాన్ని సమర్పించారు. దశాబ్దాల పాటు దేశానికి సేవలందించిన తాము, చైర్మన్, డైరెక్టర్ల స్థాయిలో పనిచేసిన వారితో పాటు లక్షలాది బొగ్గు కార్మికులు కలిసి దేశ ఇంధన భద్రతకు బలమైన పునాది వేసినట్లు తెలిపారు. దేశ వాణిజ్య ఇంధన అవసరాల్లో 55 శాతం కంటే ఎక్కువ వాటాను అందించడంలో కోల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని, ప్రతి సంవత్సరం 70 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని జాతీయ ఖజానాకు అందిస్తున్నామని పేర్కొన్నారు. సుమారు 5 లక్షల మంది రిటైర్డ్ కోల్ కార్మికుల తరపున ఈ విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. పెన్షన్ సవరణ చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, పదవీ విరమణ సమయంలో నిర్ణయించిన పెన్షన్ జీవితాంతం మారకుండా ఉండిపోవడం వల్ల ధరల పెరుగుదలతో జీవనం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వైద్య ఖర్చులు, నిత్యావసరాల ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్‌లో ఎటువంటి సవరణ లేకపోవడం ప్రధాన సమస్యగా వారు ఆ పత్రంలో వివరించారు. భారతదేశంలో బొగ్గు పరిశ్రమ దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో ప్రత్యేకమైన, కీలకమైన స్థానం కలిగి ఉందని వివరించారు. ఇతర పరిశ్రమలతో పోలిస్తే, బొగ్గు రంగం శాస్త్రీయ గనుల తవ్వకం, వనరుల సంరక్షణపై ఆధారపడి కొనసాగుతోందని తెలిపారు. జాతీయాకరణ అనంతరం పబ్లిక్ సెక్టార్ సంస్థలు కఠిన పరిస్థితుల్లో నిరంతరం శ్రమిస్తూ ఈ రంగాన్ని బలోపేతం చేశాయని, ఈ ప్రక్రియలో మానవీయ మరియు కార్యకలాప పరమైన ప్రమాదాలను ఎదుర్కొన్నట్లు గుర్తుచేశారు. దశాబ్దాలుగా బొగ్గు కార్మికులు, అధికారులు ప్రకృతి అనిశ్చితుల మధ్య అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేశారని, దేశ అభివృద్ధి, ఇంధన భద్రతలో వారి పాత్ర సైనికుల సేవలకు సాటిగా ఉందన్నారు. అయితే ప్రస్తుతం ఆ సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు పెరుగుతున్న జీవన వ్యయం, మందుల ఖర్చులు, ప్రాథమిక అవసరాల ధరలతో పోలిస్తే తక్కువైన పెన్షన్‌తో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 పథకం కింద పెన్షన్ వ్యవస్థ దుర్వినియోగం, తగిన పెట్టుబడి నిర్ణయాల లోపం కారణంగా దెబ్బతిన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లోపాలను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ 12వ నివేదిక (రిపోర్ట్ నం. 2193, తేదీ: 18 మార్చి 2020)లో ఇప్పటికే ప్రస్తావించినప్పటికీ, ప్రభుత్వం పథకాన్ని పునఃసమీక్షించి పునర్వ్యవస్థీకరించేందుకు అంగీకరించినా, ఇప్పటివరకు ఎలాంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కాబట్టి పెన్షన్ సవరణపై తక్షణ చర్యలు తీసుకుని, రిటైర్డ్ కోల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి సంస్థ నుంచి కూడా మాజీ డైరెక్టర్లు ఇ రాజా రావు(ఇ అండ్ ఎం), ఎ. మనోహర్ రావు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) ప్రధాన మంత్రిని కోరిన వారిలో ఉన్నారు.

# కాంగ్రెస్ తోనే బోథ్ అభివృద్ధి



**బోథ్, మార్చి 23 (ప్రజా జ్యోతి) :** బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు షేక్ షాకీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ మండల ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ఫైర్ స్టేషన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయడము ప్రజపాలనకు, పారదర్శక పాలనకు నిలువుటద్దం అని. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు అత్యవసరమైన ఈ సదుపాయం ఇప్పటికైనా అందుబాటులోకి రావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని తెలిపారు. అయితే, గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ కీలక అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతీవ్రంగా ఖండించదగిన విషయం అని పేర్కొన్నారు. ఫైర్ స్టేషన్ కోసం ప్రజలు, ప్రజా ప్రతినిధులు చేసిన న్యాయమైన డిమాండ్లకు స్పందించకుండా, ఉద్యమాలు చేసిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అధికార మదంతో ప్రజల స్వరాన్ని అణగదొక్కే ప్రయత్నం చేయడం అప్పటి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం అని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన గత బిఆర్ఎస్ బాధ్యత లేమి ప్రభుత్వం, వాటిని పట్టించుకోకుండా నిరసనలు అణచివేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. బోథ్ మండల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, అగ్నిప్రమాదాల సమయంలో ఎదురైన ప్రమాదాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం అభినందనీయం అని కేవలం ఒక ఫైర్ స్టేషన్ మంజూరు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు ఇచ్చిన గౌరవంగా భావించాలని తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి అడ్డు పడుతున్న అటవీ అధికారులు

• జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పాత బెల్లంపల్లి నివాసులు



**మంచిర్యాల, 23, మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల కేంద్రంలోని పాత బెల్లంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వివాదానికి దారి తీసింది. గత 30 ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న అవునూరి రజిత, ఇప్ప నాగమణి, అవునూరి రాజాం లకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం బేస్మెంట్ స్థాయికి చేరుకున్న సమయంలో అటవీ శాఖ అధికారులు వచ్చి, ఇది ఫారెస్ట్ భూమి అని పేర్కొంటూ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. “మేము గత 30 సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. ప్రభుత్వానికి కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నాం. ఇప్పుడు అకస్మాత్తుగా అటవీ అధికారులు వచ్చి నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయం” అని వారు వాపోయారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వారు, తమ ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను వేడుకున్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అవునూరి రజిత, ఇప్ప నాగమణి, అవునూరి రాజాం ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

ముగ్గురు అరెస్ట్ -- నలుగురు పరారీ



**మంచిర్యాల, 23, మార్చి (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయగా, నలుగురు పరారయ్యారు. నమ్మదగిన సమాచారం తో కోటపల్లి ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో కలిసి రాంపూర్ శివారులో తనిఖీలు చేపట్టగా, అక్కడ ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మిగిలిన నలుగురు అక్కడి నుంచి పారిపోయారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి 4 వేల 50 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు జనగాం మల్లేష్, మనుమల్ల అనిల్, గోగు నాగరాజు కాగా, పరారీలో ఉన్నవారు గోగు రాజేందర్, గోగు సత్తన్న, కుంతి పోషం, మనుమల్ల వినోద్‌గా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ, మండలంలో అక్రమ, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, టీజీఎస్పీ కానిస్టేబుళ్లు రాంప్రసాద్, సతీష్, సందీప్, రాజ్‌కుమార్, నరేష్ లు పాల్గొన్నారు.

## సోన్ మండలంలో బీజేపీ నేతల ముందస్తు అరెస్టు




**సోన్, మార్చ్ 23(ప్రజా జ్యోతి) :** తెలంగాణ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా సోన్ మండలంలోని బిజెపి పార్టీ మండల అధ్యక్షులను నాయకులను కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బిజెపి జిల్లా కార్యదర్శి,న్యూ వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు. బిజెపి కార్యకర్తలు భయపడరు.రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి 420 హామీలను ఇచ్చి ప్రజల్ని మభ్యపెడుతూ ఇప్పటివరకు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. దానికి భారతీయ జనతా పార్టీ స్పందిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బిజెపి కార్యకర్తలు వెళ్తా ఉంటే పోలీసులు అక్రమ అరెస్టులు చేసి సోన్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం సిగ్గుచేటు అన్నారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ భృతి కల్పించడంలో విఫలమైందని, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, నూతన పెన్షన్ల,అమలులో ఇలా అనేక హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇచ్చిన హామీలను అసెంబ్లీ సాక్షిగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల పాలనలో ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలను, 420 హామీలను రైతులకు ఇస్తా అన్నటువంటి రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయశీ కోసం వెంటనే నిధులు ఇచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుంచు సవీన్, మండల సర్పంచ్‌లు దేశెట్టి నరేష్, చాతిరి గంగాధర్, మారి విలాస్, మేకల మల్లేష్ యాదవ్, చిక్కిమల్ల ఉదయ్, సీనియర్ నాయకులు ముత్యపల్లి నరేష్, అల్లూరి నర్సారెడ్డి, జక్క రాజేశ్వర్, చిలారి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# సర్పంచ్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- సర్పంచ్ పై దాడి హేయమైన చర్య
- నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

నాగర్ కర్నూల్ మార్చి23సర్పంచ్ కుర్ర కమల సతీష్ పై (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని అంకిరోని పల్లి పల్లి గ్రామ సర్పంచ్ కుర్ర కమల సతీష్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలు అధికమయ్యా అని ఆయన పేర్కొన్నారు. ఎన్నుకున్న సర్పంచ్ అభ్యర్థిపై కర్రలతో దాడి చేయడం



ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడం అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. గ్రామ ప్రథమ పౌరురాలిపై దాడి చేసిన నిందితులను వెంటనే చట్టపరంగా చర్యలు చేపట్టాలని.. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం ఖాయమని



హెచ్చరించారు. ఒక మహిళ పై దాడి చేసి పాషవిక ఆనందం పొందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోలంకి శ్రీనివాస్, మంగయ్య నాయక్, శ్రీను నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బల్మూరి జానకి, చందులాల్ జవాన్ శివ చంద్ర శివ నాయక్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు

# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల మార్చి 23(ప్రజా జ్యోతి ప్రతినిధి): పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షా కేంద్రంను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్






ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం,విద్యార్థుల హాజరు,తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం,మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు.ఓఆర్ఎస్ ద్రావణాన్ని సిద్ధంగా ఉంచి అవసరమైన విద్యార్థులకు అందజేయాలన్నారు.పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు,సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలన్నారు.అనంతరం పలు తరగతి గదుల్లో తిరిగి విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండగగా శ్రీ వీరభద్ర స్వామి రథోత్సవం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, మార్చ్ 23 (ప్రజా జ్యోతి): మఖ్తల్ మండల కేంద్రంలోని స్థానిక యాదవ్ నగర్ కాలనీలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున శ్రీ వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అగ్నిగుండం తొక్కారు. ఆలయం ఆవరణలో పలురు భక్తులు భగమండుతున్న ఎర్రటి నిప్పుల కనికలపై శివ నామాలు స్మరిస్తూ నడుచుకుంటూ తమ భక్తి పారవశ్యాన్ని ప్రదర్శించారు. ఉదయం నుండి వందలాదిమంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం వీరభద్ర స్వామివారి రథోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ



అర్చకులు శివయ్య,సంతోష్ ల ఆధ్వర్యంలో వీరభద్ర స్వామివారి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు రథోత్సవాన్ని బంతిపూలతో అందంగా అలంకరించి శ్రీ వీరభద్రస్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకిలో భక్తుల భజన కీర్తనల మధ్య కురువ డోలు చప్పుడులతో మహిళలు హారతులతో ఊరేగింపు నిర్వహించి తేరుపై ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. హరహర శంకర శంభో శంకర వీరభద్ర నమో నమో అంటూ నినాదాలు చేస్తూ రథోత్సవాన్ని లాగారు. ఈ రథోత్సవ వేడుకల్లో వార్డు కౌన్సిలర్ కావాలి నరసింహ (పీకే), టిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, రాజుల ఆశి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట సురేష్,ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు కల్లూరి నాగప్ప,గుంతల శివకుమార్, ఈసారి నాగప్ప,శివ,రాము,కుమార్,రంకుల రామకృష్ణ, బిల్డర్ తాయప్ప, ల్యాబ్ మూర్తి,భజన భక్తులు,మఖ్తల్ పట్టణ చుట్టుపక్కల గ్రామాల నుండి విచ్చేసిన వేలాదిమంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా-శిశు భద్రతకు 'భరోసా' చేయూత... సరస్ ఫెయిర్‌లో అవగాహన స్టాల్ ప్రారంభం

మహబూబ్‌నగర్, మార్చి 23 (ప్రజా జ్యోతి బ్యూరో): మహబూబ్‌నగర్ పట్టణంలోని శిల్పారామంలో మార్చి 23 నుండి 29 వరకు నిర్వహిస్తున్న మినీ సరస్ ఫెయిర్ 2026లో మహిళలు, బాలబాలికల భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'భరోసా కేంద్రం' ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాల చేనేత, హస్తకళ, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన–అమ్మకాలతో ఈ ఫెయిర్ సందడిగా కొనసాగుతుండగా, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని భావించి ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.

జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత ప్రారంభించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం అందించే సేవలను ప్రజలకు వివరించారు. భరోసా కేంద్రం ద్వారా మహిళలు, బాలబాలికలపై జరిగే హింస, వేధింపులు, దౌర్జన్యాల బాధితులకు సురక్షిత వాతావరణంలో సహాయం అందించడం,




కౌన్సిలింగ్ ద్వారా మానసిక ధైర్యం కల్పించడం, అవసరమైనప్పుడు న్యాయ సహాయం, మెడికల్ సపోర్ట్ వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఫిర్యాదులను వేగంగా స్వీకరించి సంబంధిత విభాగాలతో సమన్వయం చేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కుటుంబ వివాదాల పరిష్కారానికి సమాధానపూర్వక చర్చలు నిర్వహించడం కూడా భరోసా కేంద్రం ముఖ్య లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. స్టాల్‌ను సందర్శిస్తున్న ప్రజలకు సభ్యులు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ, ఎలాంటి సమస్యలు వచ్చినా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నారని, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల రక్షణలో భరోసా కేంద్రం విశ్వసనీయ వేదికగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, భరోసా ఇంచార్జి డబ్ల్యూఎస్ఐ అరుణతో పాటు భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

# కాంక్రీట్ జంగిల్‌లో కుక్కల రాజ్యం...

- కలెక్టర్ గారూ.. మాకు ఓటు హక్కు లేదు రక్షణ కుడా వుండదా....?! - కుక్కల స్వైర విహారం... ప్రజల నిరాశ్రయం!"
- " కుక్కల రాజ్యంలో 'కాగితాల రాజ్యం'!" "కాంక్రీట్ జంగిల్‌లో కమిషనర్ గారి నిద్ర గాథ!"

మహబూబ్‌నగర్, మార్చి 23 (ప్రజా జ్యోతి బ్యూరో): "అంకుల్..! ఆడుకోవడానికి బయటికొచ్చాం... కుక్కలు కరుస్తున్నాయి... మేమేం చేయాలి.?" అనే రోదనలు రోజు వినిపిస్తున్నాయి. "కాంక్రీట్ జంగిల్‌లో కమిషనర్ గారి నిద్ర గాథ!" ను చూస్తే.. మహబూబ్‌నగర్ పట్టణం క్రమంగా కాంక్రీట్ జంగల్‌గా మారుతుండగా, నగరంలో 'వీధి కుక్కల స్వైర విహారం' ప్రజలకు కొత్త కష్టాలను తెచ్చిపెడుతోంది. ఆది వారం రాత్రి వేళ గోల్ మస్జిద్ ప్రాంతంలో జరిగిన ఘటనలో చిన్నపిల్లలు కుక్కల దాడికి గురవడంతో, పట్టణ భద్రతపై మరొకసారి ప్రజల్లో తీవ్రమైన ఆందోళన వ్యక్తమవుతోంది. "పట్టణ అభివృద్ధి అంటే భవనాల పెరుగుదల మాత్రమేనా.? లేక ప్రజల భద్రత కూడా కుడా అందులో భాగమే కదా.? " అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొనగా, అధికార యంత్రాంగం మాత్రం మౌనం వహిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "కాంక్రీట్ పెరిగింది... పన్నులు కొట్లలో వసూళ్లు చేస్తున్నారు.. కార్పోరేషన్ కు వచ్చే రాబడినే చూస్తున్నారు కాని చిన్నారుల కు మాత్రం భద్రత, రక్షణా కరువైంది.? "ఎందుకు వారికి ఓటు హక్కులేదనేనా..?" అనే సందేహం మహబూబ్‌నగర్ ప్రజల మనసుల్లో మిగిలిపోతోంది. మహబూబ్‌నగర్ పట్టణం రోజురోజుకు కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న వేళ, ప్రజల భద్రత మాత్రం కాగితాలపైనే పరిమితమవుతోంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న పేషంట్స్ అటెండర్స్, గోల్ మస్జిద్ ప్రాంతంలో చిన్నపిల్లలపై కుక్కల దాడి ఘటన, అధికార యంత్రాంగం




"చూసే చూపు – చేసే పని" మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేసింది. "చేతిలో కర్ర లేకపోతే కుక్క దూకుతుంది" అన్న సామెత ఇక్కడ సాక్షాత్కారం అవుతోంది. నియంత్రణ చర్యలు లేకపోతే సమస్యలు తలెత్తడం సహజం. కానీ ఇక్కడ పరిస్థితి మాత్రం "ముందు చూపు లేకపోతే వెనుక నష్టం తప్పదు" అనేలా మారింది. పట్టణంలో చెత్త పేరుకుపోవడం, వీధి కుక్కల పెరుగుదలకు కారణమవుతుంటే, శాశ్వత పరిష్కారం మాత్రం ఎప్పటికీ "ఫైళ్లలోనే" తిరుగుతోంది. "గాలి మాటలు గోడ దాటవు" అన్నట్టు, ప్రకటనలు, హామీలు ప్రజల దైనందిన జీవితాన్ని రక్షించలేకపోతున్నాయి. "పిల్లల భద్రత కంటే ఫైళ్ల భద్రతే ముఖ్యమా?" అంటూ ప్రజలు అడుగుతున్న



ప్రశ్న సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు అధికారులు సమావేశాలు, సమీక్షలు అంటూ, "మద్యమద్యలో కాజు, బాదం, పిస్తాలు తింటూ కాలక్షేపం చేస్తుంటే..", మరో వైపు వీధుల్లో పిల్లలు భయంతో బిక్కు బిక్కు మంటూ అడుగులు వేస్తున్నారు. " కుక్కలను చూసి జాగ్రత్త చర్యలు చెప్పడం కాదు... అది కాటు వేయక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి " అన్న సూత్రం ఇక్కడ పూర్తిగా విస్మరించబడింది. జిల్లా కలెక్టర్ స్థాయిలో సమస్యపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎందుకంటే "పెద్దవాడు కదలితేనే చిన్నవాడు కదులుతాడు" అన్నది జగమెరిగిన సత్యం... పైస్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోతే, కిందిస్థాయి అధికారుల్లో చలనం ఉండదు, చర్యలు కేవలం రూపకల్పనగానే మిగిలిపోతాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకుంటారా.? లేక "పొయ్యిలో మంట ఉండగానే పొగ ఆర్పే ప్రయత్నం" చేస్తారా.? అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి, మహబూబ్‌నగర్ నగర కార్పొరేషన్ పరిధిలో పరిస్థితి ఒకే మాటలో చెప్పాలంటే ....................

"కుక్కల స్వైర విహారం... ప్రజల నిరాశ్రయం!"

ఇప్పుడు నిర్ణయం అధికారులదే:.....................

"కుక్కలు స్వేచ్ఛగా తిరుగుతుంటే... చిన్నారులు ఇంట్లోనే బందీలు కావాలా.?" అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంక్రీట్ నగరాన్ని 'సురక్షిత నగరం'గా మార్చాలా... లేక 'కుక్కల రాజ్యం'గానే వదిలేయాలా..? "కాంక్రీట్ జంగిల్‌లో కుక్కల రాజ్యం... కలెక్టర్ స్పందన ఎప్పుడూ.?" అంటూ పట్టణ భద్రతపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రజల ఆవేదన అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్త గారు వెంటనే స్పందించి "వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం" చూపాలని కోరుతున్నారు. పట్టణంలోని ప్రతి డివిజన్‌లో ఉన్న వీధి కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర నుంచి మేల్కొని చర్యలు తీసుకుంటారా.? లేక సమస్యలు మరింత పెరిగిన తర్వాతే స్పందిస్తారా.? అన్న ప్రశ్నలు ప్రజల్లో ఉత్కంఠతో కూడిన అనుమానాలను రేకెత్తిస్తున్నాయి

# ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల మార్చి 23(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజావాణికి ప్రతి వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు,ఆర్డీవో తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 56 అర్జీలు వచ్చాయన్నారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ,ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్ లో ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణికి సంబంధించి 435 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు.దరఖాస్తుదారులు అవసరమైన సందర్భాల్లో తమ అర్జీలకు సంబంధించిన రికార్డులు,ఇతర పత్రాలు తీసుకురాకుండా వస్తే ఆ



సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు.ఆయా మండలాల్లోనూ వివిధ శాఖలకు సంబంధించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, ముఖ్యంగా రెవిన్యూ శాఖలో భూ సంబంధ సమస్యలపై వచ్చిన వందలాది అర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు.ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ కింది స్థాయి అధికారులు,సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్ లో ఉన్న అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.మండల స్థాయి అధికారులు సైతం తమ పరిధిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి వచ్చిన అర్జీలను పరిష్కరిస్తే చిన్న చిన్న సమస్యలకే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో



పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని,పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని,వారంలోగా షెడ్యూల్ ప్రకారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఆయా కార్యాలయాల గదుల్లో అనవసరమైన ఫర్నిచర్,ఫైల్స్ కనిపిస్తే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాలని,ప్రతి కార్యాలయం వద్ద బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా పలు రంగాల్లో వెనుకబడిందని,జిల్లా పరిపాలన యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తేనే మన జిల్లా ఆయా రంగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,గురుకుల విద్యాలయాలు,వసతి గృహాలు,ఆసుపత్రులను తమ పరిధిలోని మండలాల ప్రత్యేక అధికారులు,తహసిల్దార్లు,ఎంపీడీవోలు తరచు సందర్శిస్తూ అక్కడి పనితీరు మెరుగుపడేందుకు సహకరించాలన్నారు.ఈ అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతోపాటు గురుకుల విద్యాలయాల్లో భోజనం చేయాలని,పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు.ప్రతి బుధవారం 11:00 గంటలకు పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ,నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆహార నాణ్యతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ

- హోటళ్లు, పాఠశాలలు, హాస్టళ్లలో తరచూ నమూనాల సేకరణకు ఆదేశాలు
- ఎల్‌పీజీ సరఫరాపై ఆందోళన అవసరం లేదు: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మార్చి 23 (ప్రజాజ్యోతి): జిల్లాలో ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని



హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో ఆహార నియమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. సోమవారం ప్రజావాణి హాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆహార నాణ్యత, గ్యాస్ సిలిండర్ల సరఫరాపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. రానున్న వర్షాకాలంలో విద్యార్థులు, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. విద్యాలయాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లలో ఆహార నిల్వలు మరియు వండిన పదార్థాల నమూనాలను తరచూ సేకరించి ప్రయోగశాలలకు పంపించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారికి సూచించారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు, అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఆహార నమూనాలపై క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆదేశించారు. అన్ని ఆహార తయారీ సంస్థలు

తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐలో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనికోసం ఎఫ్ ఓ ఎస్ సి ఓ ఎస్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాపై మాట్లాడుతూ, పశ్చిమాసియా యుద్ధాల కారణంగా క్రూడ్ ఆయిల్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నప్పటికీ, గృహావసరాలకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వాణిజ్య సిలిండర్లలో మాత్రమే కొంత పరిమితి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాతే సిలిండర్ బుకింగ్ చేయాలని ప్రజలకు సూచించారు. అవసరం లేకుండా ముందస్తుగా బుకింగ్ చేసుకోవద్దని తెలిపారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు,

ఆసుపత్రులకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్య నాయక్, జడ్పీ సీఈఓ యాదయ్య, జిల్లా సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మార్చి 23 (ప్రజాజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్



తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరుపై కలెక్టర్ విచారణ చేయగా, మొత్తం 251 మంది విద్యార్థుల్లో 250 మంది సోమవారం నిర్వహించిన ఆంగ్ల పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య కనీస దూరం పాటించేలా కూర్చోబెట్టాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో మొబైల్ ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులపై తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, పరీక్ష కేంద్ర సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలలో పాల్గొనండి





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 23, (ప్రజాజ్యోతి) :** వరంగల్ మహానగరంలో ప్రఖ్యాతిగాంచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్థాపనకు 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 29న (ఆదివారం) ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిలను పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వేడుకలకు అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్లో విద్యనభ్యసించి ప్రస్తుతం దేశ విదేశాలలో వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు జి.మహేందర్ రెడ్డి, మేకల అక్షయ్ కుమార్, కె.వెంకటేశ్వర్లు, పి.ఆనంద్ కుమార్, దొడ్డిపల్లి కుమార్, యం.భిక్షపతి, యం.ప్రకాశ్, బి.విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు అండగా నాగుర్ల

– ఏకతాటిపైకి ఉద్యమకారులు – ఉద్యమకారుడికి అపన్న హస్తం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 23,(ప్రజాజ్యోతి) :** ఉద్యమకారులకు ఎప్పుడు అండగా ఉంటానని, ఉద్యమకారుడు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. కష్టకాలంలో వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు భరోసాను కల్పించారు. నాగుర్ల వెంకటేశ్వర్లు ఆదేశానుసారం ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్ ఆధ్వర్యంలో గీసుకొండ మండలం,గొర్రెకుంట గ్రామానికి చెందిన ఉద్యమకారునికి ఉద్యమకారులు మరియు కొంతమంది దాతలు ఆర్థిక సాయం అందించిన సహాయం మొత్తం రూ.38,016 జమ చేసి, ఇట్టి మొత్తాన్ని నాగుర్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఎం జి ఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తోటి ఉద్యమకారుడు అయిన కోట ప్రవీణ్ కి అందించారు. ఈ కార్యక్రమం లో ఉద్యమకారుల సంఘం నాయకులు గుర్రం రఘు, మిద్దెపాక విజయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడికి అండగా మిత్రులు



**పరకాల, మార్చి 23,(ప్రజాజ్యోతి) :** తమతోపాటు కలిసి చదువుకున్న మిత్రునికి ఆర్థిక సాయం అందించారు. నడికూడ మండలంలోని వరికోల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012 వ సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ కి చెందిన దొగ్గెల సునీల్ తల్లి కోమల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సునీల్ తో కలిసి చదువుకున్న స్నేహితులు తమ మిత్రుడికి ఆర్థిక సహాయం అందించి తోడుగా నిలిచామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి సంపత్, రామంచ విష్ణు, తవిటి సురేష్, చింతల రజనీకాంత్, పకిడే శివాజీ, చింతల రాజు, గోల్కొండ ప్రగత్ లు పాల్గొన్నారు.

# ప్రీతమ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డా. మడికొండ



**పరకాల, మార్చి 23, (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కో–ఆర్డినేటర్ నాగరిగారి ప్రీతమ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్–చైర్మన్, నేషనల్ డా. బీఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత (2018) డాక్టర్ మడికొండ శ్రీను, టీపీసీసీ ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర చైర్మన్ దబ్బేట రమేష్, రాష్ట్ర కన్వీనర్లు నత్తి కార్నీల్, అర్షం అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు బొజ్జం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు నాగరిగారి ప్రీతమ్‌ను అభినందిస్తూ, యువకుడిగా, ఉత్సాహవంతుడిగా సమాజానికి సేవలందిస్తున్న ఆయనకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా

# నీటి సంరక్షణపై అవగాహన







**హసన్‌పర్తి, మార్చి 23 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తిలోని సుజాత విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం "నీరు – లింగ సమానత్వం" అంశాన్ని పురస్కరించుకొని నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుతోట శాంతారాం కర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సకల జీవరాశులకు నీరే ప్రాణాధారం అని తెలిపారు. నీరు లేక జీవకోటి మనుగడ సాధ్యం కాదని, ప్రతి వ్యక్తికి పరిశుభ్రమైన నీరు అత్యవసరమని పేర్కొన్నారు. రోజువారీ అవసరాలకు త్రాగునీరు, గృహ అవసరాలకు గణనీయమైన నీరు అవసరమవుతుందని వివరించారు. ప్రస్తుతం అనేక మందికి పరిశుభ్రమైన నీరు అందక ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే సంవత్సరాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశముందని తెలిపారు. భూమిపై విస్తారంగా నీరు ఉన్నప్పటికీ అందులో కొద్దిపాటి మాత్రమే మంచినీరు అందుబాటులో ఉందని చెప్పారు. పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవనశైలి, కాలుష్యం, వాతావరణ మార్పులు భూగర్భ జలాలను తగ్గిస్తున్నాయని వివరించారు. వర్షపాతం తగ్గిపోవడంతో నీటి ఎద్దడి సమస్య పెరుగుతోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు నీటిని అందించాలంటే ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణకు అనుసరించాల్సిన మార్గాలను వివరించారు. ఇంట్లో నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, వాడిన నీటిని మొక్కలకు మళ్లించడం, వాననీటి నిల్వ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, స్నానం, పళ్ళు తోముకోవడం సమయంలో నీటి వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలను సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే పరిశుభ్రమైన నీరు లభిస్తుందని తెలిపారు. పాఠశాలలో గత మూడు దశాబ్దాలుగా పర్యావరణ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మార్చి 22న జల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి జల సంరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయులు గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ వెంకట్, ఈ ప్రవీణ్, అచ్యుత్ రెడ్డి, పి వెంకటేశ్వర్లు, వై అరుణ, సిహెచ్ సంధ్య, సిహెచ్ సుచిత్ర, జి సంధ్య, సరిత, లావణ్య, రాధాకుమారి, భవాని, సబిహా, మౌనిక, దేవిక, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలి

## మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య



**హనుమకొండ మార్చి 23 (ప్రజా జ్యోతి) :** భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించినప్పటికీ, వాటి అమలులో ఇంకా లోపాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య అన్నారు. దళితులు, బలహీన వర్గాలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలంటే ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) హనుమకొండ జిల్లా రెండవ మహాసభలు ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిమ్మల మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పోతరాజు సారయ్య మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి రాజ్యాంగ విలువలు ప్రతి వ్యక్తి జీవితంలో ప్రతిబింబించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే వాస్తవ పరిస్థితుల్లో దళితులపై వివక్ష, దాడులు, భూసంబంధ సమస్యలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దళిత సంక్షేమానికి కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించి, విద్య, ఉపాధి, భూహక్కుల రంగాల్లో అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని కఠినంగా అమలు చేసి బాధితులకు తక్షణ న్యాయం అందించాలని కోరారు. దళిత యువత విద్యలో ముందుకు రావడం, చైతన్యంతో హక్కుల సాధన కోసం పోరాడడం అత్యవసరమని సారయ్య సూచించారు. సమాజంలో సమానత్వం నెలకొల్పాలంటే ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర రెండవ మహాసభలు ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్ నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్ర బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టేపాక రవి, రెంటాల దేవా, రాజారపు రత్నం, సందీప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదోడికి గ్యాస్ లేదు.. అధికారుల జాడే లేదు..!







- హోటళ్లలో మాత్రం పదుల సంఖ్యలో సిలిండర్లు..
- పర్వతగిరిలో ఎల్పీజీ దందా ఎవరో వీరికి అండ..?
- సబ్సిడీ గ్యాస్‌పై బహిరంగ దోపిడీ..
- పేదలు సిలిండర్ కోసం ఎదురు చూపులు.. అధికారులు మౌనం ఎందుకు..?
- రైడ్స్ లేవు,చర్యలు లేవు, బాధ్యత ఎవరిది..?
- గ్యాస్ మాఫియా ముందుకు.. ప్రభుత్వ యంత్రాంగం వెనుకకు..?
- పేదోడికే దొరకని గ్యాస్.. హోటల్ కిచెన్లలో ఎలా మండుతోంది..?

**పర్వతగిరి, మార్చి 23 (ప్రజాజ్యోతి) :** పేదల కోసం ఉద్దేశించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు అందక మహిళలు ఇబ్బందులు పడుతుంటే హోటళ్లలో మాత్రం వరుసగా సిలిండర్లు వినియోగం అవుతున్న దృశ్యాలు వరంగల్ జిల్లా పర్వతగిరి స్థానికులను ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఈ మొత్తం వ్యవహారం జరుగుతుండగా సంబంధిత అధికారుల జాడ మాత్రం ఎక్కడా కనిపించడంలేదు! వాణిజ్య అవసరాలకు కమర్షియల్ గ్యాస్ వినియోగించాల్సిన చోట, తక్కువ ధరలో లభించే డొమెస్టిక్ సిలిండర్లను కొందరు వ్యాపారులు పెద్ద ఎత్తున సేకరించి హోటళ్లలో వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల గృహ వినియోగదారులకు సరఫరా తగ్గిపోతోందని స్థానికులు అంటున్నారు. ఇటీవలి కాలంలో డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్రంగా మారుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులు గ్యాస్ సిలిండర్ల కోసం రోజులు తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. బుకింగ్ చేసిన తర్వాత కూడా సరఫరా ఆలస్యమవుతుండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుకింగ్ చేసినా 10--15 రోజులు గ్యాస్ రాకపోవడం ఏజెన్సీల వద్ద స్పష్టమైన సమాచారం లేకపోవడం బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వంట కోసం మళ్లీ మట్టికట్టెలపై ఆధారపడాల్సిన పరిస్థితి. స్థానికులు చెబుతున్నదేమిటంటే, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు హోటళ్లకు, వ్యాపార సంస్థలకు మళ్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గృహ వినియోగానికి ఇవ్వాల్సిన గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడం వల్లే కొరత తీవ్రంగా ఉందని ప్రజలు అంటున్నారు. గ్యాస్ కోసం ఎన్నిసార్లు ఏజెన్సీ చుట్టూ తిరగాలి? పిల్లలకు వంట చేయడమే కష్టంగా మారింది" అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. తనిఖీలు చేయాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వెంటనే గ్యాస్ సరఫరా సక్రమంగా చేయాలి,అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి,ప్రతి వినియోగదారుడికి సమయానికి సిలిండర్ అందేలా చర్యలు చేపట్టాలి,

ప్రాణాధారమైన వంట గ్యాస్ కూడా అందకపోతే ఎలా?" అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# అక్రమ అరెస్టులతో- ఉద్యమాన్ని ఆపలేరు

## – నర్సంపేట బిజెపి నాయకులు ముందస్తు అరెస్ట్



**నర్సంపేట మర్చి 23 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట,అవినీతి,అరాచక, కమిషన్ల పాలన సాగిస్తున్నరాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడి మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ మెదలు వంచుదాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుంది. ఇదే కాంగ్రెస్ కొత్త డెమోక్రసీ మోడల్!

**ప్రశ్నిస్తే ప్రజాస్వామ్యం బలపడాలి...:** కానీ ఇక్కడ ప్రశ్నించే వాళ్లను అక్రమ అరెస్ట్ చేస్తేనే 'ఫ్రెండ్లీ పోలీస్' డ్యూటీ పూర్తి అయినట్టే! నిరంకుశ అవినీతి, కమిషన్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి అసెంబ్లీ కార్యమానికి ప్రజాస్వామ్యం గేటు వద్దే 'ప్రివెంటివ్ అరెస్ట్'!

ఇదేనా మీ 'ప్రజా ప్రభుత్వం'? లేక 'ప్రశ్నల భయం' ప్రభుత్వమా?

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు... పోరాటం ఆగదు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హాజరవ్వడానికి సిద్ధమవుతున్న నర్సంపేట పట్టణ బిజెపి నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండించి ఘాటుగా విమర్శించిన బీజేపీ నాయకులు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కులను అణగదొక్కేందుకు ప్రభుత్వం ఇలాంటి అక్రమ చర్యలకు దిగడం దారుణమని అన్నారు ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులను ముందుగానే నిర్బంధించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. అయితే ఇలాంటి అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపలేరని, రైతులు, నిరుద్యోగులు, మహిళల సమస్యలపై పోరాటం బీజేపీ కొనసాగిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అక్రమ అరెస్టులో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహా రాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, మాజీ బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ జూలూరు మనీష్ గౌడ్, యు మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకీస విగ్నేష్ గౌడ్,పట్టణ ఉపాధ్యక్షుడు ఠాకూర్ విజయ్ సింగ్,ఎస్ టి మోర్చా నాయకులు భానోత్ రాజేందర్, బిజెపి కార్యదర్శి సామల ప్రవీణ్ కుమార్,బీజేవైఎం జిల్లా కార్యదర్శి చిలువేరు అన్వేష్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిరోధక చట్టం

## గోడ ప్రతులను ఆవిష్కరించిన కలెక్టర్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 23, (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం–2006కు సంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆవిష్కరించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో, మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా "బేటీ బచావో–బేటీ పఢావో" కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక అధికారులుగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ/సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, మండల స్థాయిలో తహశీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సీఎంపీవోగా వ్యవహరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీను, పరకాల మరియు హనుమకొండ ఆర్డీఓలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ విశ్వజ, జీఈసీఓ సునీత, ఈఓ సింధు రాణి, మిషన్ కోఆర్డినేటర్లు కళ్యాణి, పావని తదితరులు పాల్గొన్నారు.

# ఏబిఎన్ రిపోర్టర్‌ను పరామర్శించిన మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్



**నర్సంపేట మార్చి 23 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట డివిజన్ ఏబిఎన్ రిపోర్టర్ బూర వేణు పెద్ద కుమార్తె బూర భువన అనారోగ్యం తో మృతి చెందారు... వారి భౌతిక కాయానికి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. వారి ఆత్మకి శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ బి ఎన్ జిల్లా స్టాఫర్ దొంతు నవీన్ గౌడ్,మోకుదెబ్బ జిల్లా సలహాదారులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సొల్తీ సారయ్య గౌడ్, మోకుదెబ్బ జిల్లా సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, నర్సంపేట మండలం అధ్యక్షులు జనగాం మల్లికార్జున్ గౌడ్, మచ్చిక నర్సయ్య గౌడ్, తోటకూరి సదానందం గౌడ్, బూర అనిల్ గౌడ్,గోపగాని శోభన్ గౌడ్,గోడిశాల కిరణ్ గౌడ్, బూర సుధాకర్ గౌడ్, బూర కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్



**వర్ధన్నపేట, మార్చి 23, ప్రజా జ్యోతి :** హైదరాబాద్‌లోని చెంగిచర్ల ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరగారి ప్రీతం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ నరుకుడు వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నరుకుడు వెంకటయ్య నగరగారి ప్రీతంని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గుర్తుగా ఒక కలం బహూకరించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా, అలాగే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నగరగారి ప్రీతం చేస్తున్న సేవలను వెంకటయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని నగరగారి ప్రీతంకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలంటే యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందాలి

తుంగతుర్తి, మార్చి 23,(ప్రజా జ్యోతి): సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలంటే యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం అత్యవసరమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ మోటివేషనల్ స్పీకర్లు గుండ్ల ఆంజనేయులు మల్లెపాక రవీందర్ అన్నారు.ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముప్పై రోజుల ఆన్లైన్ శిక్షణలో మోటివేషనల్ స్పీకర్ మరియు ట్రైనర్ శిక్షణ పూర్తి చేసుకున్న తుంగతుర్తి మండలానికి చెందిన గుండ్ల ఆంజనేయులు, మల్లెపాక రవీందర్ ఈనెల 21,22 తేదీలలో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఆఫ్ లైన్ వర్క్ షాప్ లో భాగంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నేషనల్ బోర్డు మెంబర్ నూనె సుదర్శన్, నల్లగొండ రీజియన్ అధ్యక్షులు కోట్ల సాయికిరణ్ చేతుల మీదుగా సర్టిఫైడ్ స్పీకర్ మరియు ట్రైనర్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ శిక్షణలో వ్యక్తిత్వ వికాసం, టైం మేనేజ్మెంట్, గోల్ సెట్టింగ్, బెస్ట్ పేరెంటింగ్, సమర్థవంతమైన ప్రసంగ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, విద్యార్థులు మరియు యువతను ప్రేరేపించే పద్ధతులు వంటి అంశాలపై సమగ్ర అవగాహన పొందినట్లు తెలిపారు.ఈ శిక్షణ ద్వారా మరింత బాధ్యతతో సేవ చేయగలుగుతామని తెలిపారు. మోటివేషన్ అనేది మాటల్లోనే కాదు, ఆచరణలో కూడా కనిపించాలని,అందుకు ఈ శిక్షణ మాకు మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గురూజీ గంప నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో నల్లగొండ రీజియన్ సెక్రటరీ నారాయణ కవిత, కోశాధికారి కోట సరిత, డైరెక్టర్ ట్రైనింగ్ గూడూరు అంజిరెడ్డి, నారీసెల్ డైరెక్టర్ శ్రీలత,మెంటర్స్ ఆశ్రిత, భీష్మా చారి, విజయ్, సరిత, బాలు, రవీంద్రా చారి, రవీందర్ రెడ్డి మరియు శిక్షణ పొందిన సభ్యులు పాల్గొన్నారు.




## పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి: సర్పంచ్

తుంగతుర్తి, మార్చి 23,(ప్రజా జ్యోతి): పశుపోషకులు నిర్లక్ష్యం చేయకుండా తమ పశువులకు టీకాలు వేయించాలని సర్పంచ్ మోర సంధ్య భిక్షం అన్నారు. సోమవారం



మండల పరిధిలోని కరివిరాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ వ్యాధి సోకితే పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు గ్రామంలో 74 పశువులకు టీకాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఆకుల నరేష్, సిబ్బంది రవి, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

## అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం: సాయిబాబా

తుంగతుర్తి, మార్చి 23,(ప్రజా జ్యోతి): 'ఛలో అసెంబ్లీ' ముట్టడికి వెళ్తున్న తుంగతుర్తి బీజేపీ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. పోలీసుల చర్య



అప్రజాస్వామికమని సర్పంచ్ మల్లెపాక సాయిబాబా మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు బీజేపీ పోరాడుతుందన్నారు. అరెస్ట్ అయిన వారిలో కత్తుల నరేష్, కొండ రవి, బొంకూరి నవీన్ తదితరులున్నారు.

## బీసీ ప్రజా సమితి రాష్ట్ర కార్యదర్శిగా జటంగి లింగమూర్తి నియామకం

తుంగతుర్తి, మార్చి 23,(ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజా సమితి రాష్ట్ర కార్యదర్శిగా మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన జటంగి లింగమూర్తిని ఆ సంఘం రాష్ట్ర కమిటీ నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా లింగయ్యకు అధికారిక నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తనపై ఉంచిన నమ్మకానికి బీసీ సంఘానికి కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ఐక్యతను బలోపేతం చేసి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. సంఘం లక్ష్యాలను ప్రజలకు చేరువ చేస్తూ, బీసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేయడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని లింగమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.



## మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహణ

మోత్కూరు మార్చి 23 (ప్రజాజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ రామలింగశ్వర స్వామి ఆలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే మహా అన్నప్రసాద కార్యక్రమం ఈసారి ప్రత్యేకంగా నిర్వహించబడింది.



మోత్కూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా సతీమణి కళ్యాణి పుట్టినరోజు సందర్భంగా ఈ మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, నాయకులు బొల్లెపల్లి శ్రావణ్, శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు బుర్ర కృష్ణ, బుర్ర యాదయ్య, అంజయ్య, సంతోష్, అన్నెపు నర్సింహా, అన్నెపు వెంకన్న, సజ్జనం పాండు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భక్తులకు అన్నదానం చేయడం అత్యంత పుణ్యకార్యమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

# దిశా నిర్దేశం లేని వంచన బడ్జెట్

### రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పై ధ్వజమెత్తిన బిఆర్ ఎస్ నాయకులు

మిర్యాలగూడ,మార్చి 23, ( ప్రజాజ్యోతి ): తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీతో ప్రజలను మోసం చేసే వంచన బడ్జెట్ అని మిర్యాలగూడ బి ఆర్ ఎస్ పార్టీ నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బిసి ,ఎస్సీ ,ఎస్టీ , మైనారిటీ, రైతు విభాగాల నేతలు పాల్గొని బడ్జెట్ లో జరిగిన అన్యాయాన్ని ఎండగట్టారు.రైతు భరోసా కింద 15 వేల రూపాయలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, ఈ బడ్జెట్లో ఆ ఊసే ఎత్తకపోవడంసిగ్గుచేటని, రుణమాఫీకి అరకొర నిధులు కేటాయించి రైతుల నోట్లో మట్టి కొట్టారని మాజీ జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు.బీసీలకు కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రుణాలకు మొండిచేయి చూపారు.కులవృత్తులను ప్రోత్సహించే పథకాలకు నిధుల కోత విధించడం బీసీ వర్గాల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వివక్షకు నిదర్శనం అని రాష్ట్ర నాయకుడు అన్నబీమోజు నాగార్జున చారి అన్నారు.దళిత బంధు పథకాన్ని అటకెక్కించి,ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించడం దారుణమని, గిరిజన తండాలఅభివృద్ధి కి కేటాయింపులు నామ మాత్రంగానే ఉన్నాయని మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్, మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్ లు అన్నారు.మైనారిటీల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు కేవలం కాగితాలకే పరిమితం అయ్యేలా ఉన్నాయని,గతంలో ఉన్న విద్యా, ఉపాధి పథకాలను ఈ ప్రభుత్వం నీరుగారుస్తోందని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.మగ్దూం పాషా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి.ఇలియాస్ ఖాన్, మైనారిటీ నేతలు ఎండి.మాజీద్, ఎండి.షోయబ్ లు అన్నారు.ఆరుగ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బడ్జెట్ లో వాటికి నిధులు చూపకుండా ప్రజలను మభ్యపెడుతోందని,ఇది అభివృద్ధికి బాటలు వేసే బడ్జెట్ కాదు, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టి, సంక్షేమాన్ని తుంగలో తొక్కే బడ్జెట్ అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో యడవెల్లి శ్రీనివాస రెడ్డి, పాలుట్లబాబయ్య,నామిరెడ్డి కరుణాకర రెడ్డి,మట్టపల్లి సైదయ్య యాదవ్, పేరాల కృపాకర్ రావు, చౌగాని బిక్షం గౌడ్,అమరావతి సైదులు,చిర్ర మల్లయ్య యాదవ్, కొత్త మరెడ్డి,పి సి కె ప్రసాద్, ఆయిల వెంకన్న,ఖాజా మొయినుద్దిన్, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతం కోసం కృషి చేయాలి

ఖానాపురం మార్చి 23 (ప్రజాజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతం కోసం రైతులు కృషి చేయాలని పిఏసి ఇన్చార్జ్ చడపంగు అంబేద్కర్ సోమవారం సర్వసభ్య సమావేశంలో అభ్యర్థించారు. సొసైటీ ద్వారా రైతులకు ఇప్పటివరకు 6,18,56,131 రూపాయల రుణాలు అందించినట్టు, బ్యాంకుకు చెల్లించవలసిన అప్పు



3,31,17,636 రూపాయల మేరుగా ఉందని ఆయన తెలిపారు. అలాగే, సంఘం యొక్క నికర లాభం 2,87,38,494 రూపాయలు ఉన్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అతి చిన్న సొసైటీగా వ్యవహరిస్తున్న ఖానాపురం సహకార సంఘం, రైతులకు అవసరమైన వసతులను అందించడంలో ముందుండి పనిచేస్తోంది. రైతులు రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సంఘం అభివృద్ధికి తోడ్పడతారని ఆయన రైతులకు కు సూచించారు. చివరగా, రైతులకు మరింత సేవలను అందించేందుకు సంఘం సిద్ధంగా ఉందని చడపంగు అంబేద్కర్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ లాజర్, ఉప సర్పంచ్ జగన్ సీఈవో నాగేశ్వరరావు, సిబ్బంది వీరయ్య, మాధవి, పాల్గొన్నారు.

## విద్యా రంగానికి చారిత్రాత్మక కేటాయింపులు

దేవరకొండ, మార్చి 23(ప్రజాజ్యోతి): రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎన్ఎస్యూఐ దేవరకొండ




నియోజకవర్గ నాయకుడు, గుర్రపు తండ సర్పంచ్ రామావత్ సేవ నాయక్ ధన్యవాదాలు తెలిపారు.ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం, డిప్లమా మరియు ఐటీఐ విద్యార్థులకు ప్రతినెల రూ.2000 స్కాలర్షిప్ ప్రకటించడం వంటి నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ప్రముఖ విద్యాసంస్థ ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించడం విద్యా మౌలిక వసతుల మెరుగుదలకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు.యువత అభివృద్ధి కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకానికి రూ.6000 కోట్లు కేటాయించడం ఉపాధి అవకాశాలను పెంచే దిశగా కీలక నిర్ణయమని తెలిపారు.విద్యార్థులు, యువత సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని, ఇలాంటి ప్రజాహిత నిర్ణయాలు కొనసాగించాలని కోరారు.దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నాయకత్వంలో త్వరలోనే దేవరకొండలో సమగ్ర పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ నాయకులు గుండాల రాజేష్ యాదవ్, బాణవాత్ అఖిల్, కుంచాల నాగేంద్ర, అంబోతు అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ పద్మశాలి ఉగాది సేవా పురస్కారం అందుకున్న రాపోలు రాజశేఖర్

రామన్నపేట మార్చు 23 (ప్రజా జ్యోతి): పద్మశాలి వ్యాపార్ టెక్స్టైల్& లైఫ్స్టైల్ ఎక్స్పో ఆధ్వర్యంలో తెలంగాణ పద్మశాలి సంఘం, తెలంగాణ చేనేత ఐక్యవేదిక, తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సమన్వయంతో హైదరాబాద్ ఉత్తమ ఉగాది పురస్కారాలు ప్రకటించారు. ఈ మేరకు కేబిఆర్ కన్వెన్షన్ ఎల్బీనగర్ నందు ఆదివారం జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఉత్తమ పద్మశాలి ప్రతిభా సేవా పురస్కారం అందుకున్న రాపోలు రాజశేఖర్. మాజీ మంత్రివర్యులు సినినటులు డాక్టర్ బాబూమోహన్ గారి చేతులమీదుగా సన్మానం పొంది అవార్డు అందుకున్నారు. తెలంగాణ పద్మశాలి సమాజానికి మరియు కార్మికులకు అందించిన సేవలను ప్రముఖులు కొనియాడారు.




# రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయాలి

- ఏదుల రిజర్వాయర్ వద్ద 436 మీటర్ల ఎత్తు నుంచి దిండి కాలువకు నీటిని సరఫరా చేయాలి
- దిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలి
- రాచకొండ ఎత్తిపోతలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి
- సాగునీరు లేక రైతుల వరి పంటలు ఎండుతున్నాయి
- తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఎం రైతు సంఘం ధర్నా

సంస్థాన్ నారాయణపురం, మార్చి 23, (ప్రజాజ్యోతి) : రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించాలని సిపిఎం రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాచకొండ ఎత్తిపోతల పథకం మంజూరు చేయకుంటే సంస్థాన్ నారాయణపురం మండలానికి, చౌటుప్పల్ మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందదని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ వద్ద 436 మీటర్ల ఎత్తు నుంచి డిండి కాలువలకు నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగమైన ప్రాజెక్టులన్నింటిని వెంటనే పూర్తి చేసి రైతాంగానికి సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. సోమవారం సంస్థాన్ నారాయణ పురం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మార్తూరు బాలరాజు గుంటూరు శ్రీనివాసచారి బూరుగు కృష్ణారెడ్డి లో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన వాటి నుంచి నేటి వరకు మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలంలోని కొన్ని గ్రామాలు సాగునీరు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కేవలం వర్షాధారం మీదనే రైతాంగం అరకొర పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు కురువగా వరి పంటలు వేశారన్నారు. కానీ పంటలు పొట్ట దశలో ఉండగా భూగర్భ జలాలు తగ్గిపోయి ఆ పంటలు ఇప్పుడు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తూ ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తు చేశారు. డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి శివన్నగూడెం ప్రాజెక్టుకు నీరును అందించాలన్నారు. అదేవిధంగా రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేస్తే తప్ప ఈ మండలానికి నీరు వచ్చే అవకాశం లేదని గుర్తు చేశారు. ప్రస్తుత బడ్జెట్ లోనే రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దోనూరు నర్సిరెడ్డి, సీనియర్ నాయకుడు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి, ఎండి పాషా, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల నరసింహ, చాడా నరసింహ, బద్దుల వెంకటేశం, రాచకొండ కృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి కొమ్ము మల్లేశం, అధ్యక్షుడు బొమ్మ గాని శంకరయ్య, నాయకులు దొంత గాని శంకరయ్య, గంగాదేవి బిక్షపతి, బద్దం నర్సిరెడ్డి, వెలిజాల గోపిక, రాచకొండ సాలమ్మ, దోనూరు లక్ష్మారెడ్డి, గుండు లింగస్వామి, బద్దుల శంకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సిపిఎం కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం మండల మూడవ మహాసభ జరిగింది.





### కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన
# కార్యదర్శికి ఘనంగా సన్మానం



**కమ్మర్‌పల్లి మార్చ్ 23,ప్రజా జ్యోతి.** జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటిపల్లి నగేష్ రెడ్డి గారి అధ్యక్షత న పీసీసీ పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో జిల్లా కమిటీ ని నియమించారు, అందులో భాగంగా కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన రైతు ఉ ద్యమకారుడు (పసుపు ఎర్రజొన్న) సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఏలేటి మోహన్ రెడ్డి ని నియమించడం జరిగింది.అందులో భాగంగా ఈరోజు ఉప్లూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏలేటి మోహన్ రెడ్డి కి శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బస వేణుగోపాల్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, బద్దం రాజేశ్వర్ రెడ్డి, తక్కురి ముత్యం, ఎనేడ్ల గంగారెడ్డి, సుంకరి విజయ్, నరేందర్, బద్దం నగేష్,తిరుపతి రెడ్డి, సాదుల్లా, బైండ్ల శ్రీనివాస్, రాకేష్, నరేష్,ఆంజనేయులు, ఫారూఖ్, సల్మాన్, అనిల్, ఉబేద్, శివరాం యాదవ్, తిరుమలేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రవేశపెట్టిన
# బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం



**ఆర్మూర్,మార్చి 23 ప్రజాజ్యోతి** ఆర్మూర్,నందిపేట్ భారత రాష్ట్ర సమితి మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా బీసీలకు సబ్బండ వర్గాలకు చేసిన అన్యాయాన్ని వివరిస్తూ పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. బీసీలకు లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పి మొండి చేయి చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించడం జరిగింది. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లలో అన్యాయం చట్టబద్ధమైన పదవులలో అన్యాయం ఆఖరికి బడ్జెట్లో కూడా అన్యాయం జరిగిందని మండల అధ్యక్షులు మచ్చర్ల సాగర్ తెలిపారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి సంక్షేమం మరచి అభివృద్ధిని అటకెక్కించారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మహిళలకు వృద్ధులకు యువకులకు విద్యార్థులకు కార్మిక కర్షకులకు తీవ్ర అన్యాయం చేసిందని ఈ బడ్జెట్ అంకెల గారడి చేసి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు బాబు రాజ్ రామారావు మురళి సీనియర్ నాయకులు దారం సురేష్ తాటికాయల సుభాష్ పిప్పర శ్రీనివాస్ గణేష్ పోశెట్టి దేవన్న సంతోష్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 96 దరఖాస్తులు

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి మార్చి 23. (ప్రజాజ్యోతి)** కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ సమస్యలపై వచ్చిన ఆయా శాఖలకు సంబంధించిన 96 అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి లో ఏసీఎల్బీ మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డిఓ వీణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సంఘాల
# రుణాల చెల్లింపుపై అవగాహన ర్యాలీ



**రాజంపేట మార్చి 23 (ప్రజా జ్యోతి)** రాజంపేట మండల కేంద్రంలో మండల సమైక్య కార్యాలయం ఆధ్వర్యంలో మహిళా సంఘాల రుణాల చెల్లింపుపై అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలో ఎక్కువగా నిల్వబాకీలు ఉన్నందున, వాటిని వెంటనే చెల్లించాలని సమైక్య అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు తీర్మానించారు.



ఈ సందర్భంగా సోమవారం గ్రామ సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్, కార్యదర్శి అశోక్ కుమార్, మండల సమైక్య బాధ్యులు రాజా రెడ్డి, సమైక్య అధ్యక్షురాలు సుతారి లక్ష్మి, కార్యదర్శి లతా, కోశాధికారి లావణ్య ఆధ్వర్యంలో రాజంపేట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మండల అభివృద్ధి అధికారి బాలకృష్ణ ప్రారంభించారు. మండల సమైక్య కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, ఐలమ్మ విగ్రహం, బస్టాండ్ ప్రాంతాల మీదుగా సాగింది. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని, బయట వ్యక్తుల వద్ద అప్పులు తీసుకోకుండా సంఘాల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు పొందాలని అవగాహన కల్పించారు. బస్టాండ్ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతం దృష్ట్యా ప్రతి సభ్యురాలు బకాయిలు చెల్లించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు, మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "వరి ఒక్కటే మార్గం కాదు.. పంట మార్పిడితోనే రైతుకు లాభం"

– సిరికొండలో పెరుగుతున్న వరి విస్తీర్ణం – ప్రత్యామ్నాయ పంటలపై అధికారులు, సీఎం పిలుపు

**నిజామాబాద్ రూరల్ మార్చ్, 23 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలంలో పంటల సాగు విధానంలో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా వరి పంటపై రైతుల ఆధారపడటం పెరుగుతుండగా, ఇతర పంటల సాగు క్రమంగా తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.మండలంలో మొత్తం సుమారు 28 నుంచి 29 వేల ఎకరాల వరకు పంట విస్తీర్ణం ఉ ండగా, దాదాపు 1000 ఎకరాల మెట్ట అందులో దాదాపు 25 నుంచి 26 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. మిగతా విస్తీర్ణంలో మొక్కజొన్న 500 నుంచి 600 ఎకరాలు, పసుపు 200 నుంచి 300 ఎకరాలు, పత్తి 200 నుంచి 250 ఎకరాలు, అలాగే సోయాబీన్, తొగరు పప్పు, కూరగాయలు పరిమిత స్థాయిలో సాగు చేస్తున్నారు.మూడు సంవత్సరాల క్రితం వరి పంట సుమారు 24 నుంచి 26 వేల ఎకరాల్లో మాత్రమే సాగు కాగా, ప్రస్తుతం మరో 2000 ఎకరాలు పెరగడం గమనార్హం. ఇదే ధోరణి కొనసాగితే భవిష్యత్తులో ఇతర పంటలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని అంచనా వేస్తున్నారు. ప్రతి రైతు వరిపైనే ఆధారపడితే మార్కెట్‌లో అధిక సరఫరా, ధరలు పడిపోవడం, కొనుగోలు సమస్యలు వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

ఇటీవల సిద్ధిపేట జిల్లా నర్మేటలో రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నిజాం కాలం నుంచే వాణిజ్య పంటలకు ప్రసిద్ధి చెందిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పంటల విధానంలో మార్పులు అవసరమని, వరిపై మాత్రమే ఆధారపడటం ప్రమాదకరమని స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లాలో ఒకప్పుడు కూరగాయలు, పండ్లు, ఆకుకూరల సాగు విస్తృతంగా ఉండేదని, రియల్ ఎస్టేట్ ప్రభావంతో అవి తగ్గిపోవడంతో ఇప్పుడు ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు.కేంద్రం పరిమితంగా మాత్రమే వరి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడం కూడా రైతులకు హెచ్చరికగా మారిందని, పంట మార్పిడే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చగలదని సీఎం సూచించారు.ప్రస్తుతం సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు డిమాండ్ ఎక్కువగా ఉన్నా, పండించే రైతులు తక్కువగా ఉండటం వల్ల దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని నిపుణులు చెబుతున్నారు. "పదిమంది పండిస్తే వందమంది తింటారు... ఒకరే పండిస్తే అందరికీ ఎలా సరిపోతుంది?" అన్న ఉ దాహరణ రైతుల్లో ఆలోచన రేకెత్తిస్తోంది.అలాగే మిర్చి పంటకు ప్రసిద్ధి చెందిన గుంటూరులో కూడా సాగు తగ్గిపోవడం గమనార్హం. పప్పులు, మొక్కజొన్న, జొన్నలు, నువ్వులు, సన్‌ఫ్లవర్ వంటి పంటలు తగ్గిపోతే భవిష్యత్తులో ఆహార భద్రతపై ప్రభావం పడే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**పంట మార్పిడి అవసరం:**

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటలు, కూరగాయలు, నూనె గింజల పంటలు సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. నీటి వినియోగం తగ్గడం, మట్టి ఆరోగ్యం మెరుగుపడటం, మార్కెట్‌లో మంచి ధరలు రావడం వంటి ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు.

**రైతులకు సూచన**

వరి పంటను కొంత మేర తగ్గించి, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు మళ్లితేనే స్థిరమైన ఆదాయం సాధ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ఒక్క వరిపైనే ఆధారపడే సాగు విధానం కంటే, పంటల వైవిధ్యంతో ముందుకెళితేనే రైతుకు భద్రత, లాభం రెండూ సాధ్యమని స్పష్టమవుతోంది. ఇప్పటికైనా రైతులు పంట మార్పిడిపై దృష్టి సారిస్తే భవిష్యత్తు బంగారంగా మారే అవకాశం ఉంది.

# రైతులకు మరో అవకాశం కల్పించిన ప్రభుత్వం

– రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి






**ఆర్మూర్,మార్చి 23 ప్రజాజ్యోతి** ఆర్మూర్,రైతు భరోసా పథకానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన పట్టాదారు రైతులు మాత్రమే అర్హులు.ధరణి (భూభారతి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్య భూమి ఉన్నవారు,పట్టాదారులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ హరికృష్ణ తెలిపారు. ప్రధాన అర్హతలుతెలంగాణ నివాసి, కనీస వయస్సు 18 ఏళ్లు. దరఖాస్తుదారు పేరుమీద వ్యవసాయ భూమి ఉండాలి, ధరణి పోర్టల్‌లో నమోదు. చిన్న/అంతా రైతులు, వ్యవసాయ కార్మికులు. అర్హులు లేనివారు .భూమి లేని రైతులు, వ్యవసాయ యోగ్యం కాని భూమి (బీడు భూములు, రాళ్లు, కొండలు, రియల్ ఎస్టేట్, కాల్వలు, వాణిజ్య భూములు) ఉ న్నవారు.తెలంగాణ రైతు భరోసా పథకంలో భూమి ఎకరాలకు రైతు భరోసా రాదు.సాగు చేసే ప్రతి ఎకరాకు పెట్టుబడి సాయం అందిస్తారు.అర్హత వివరాలుప్రభుత్వం అధికారికంగా ప్రకటించినట్లుగా, ఎన్ని ఎకరాలు ఉన్నా అన్ని సాగు భూములకు రూ.6,000 చొప్పున (సీజన్‌కు) డబ్బు జమ చేస్తారు.గతంలో కొన్ని విడతల్లో 2, 3, 7 లేదా 10 ఎకరాల వరకు క్రమంగా జమ చేశారు, కానీ పూర్తి పంపిణీలో ఎటువంటి సీలింగ్ లేదుసాటిలైట్ సర్వే ఆధారంగా సాగు భూములకు మాత్రమే సాయం అందుతుంది.28.02.2026 తేదీ వరకు కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన డిజిటల్ సైన్ అయిన రైతులు, అలాగే ఇప్పటివరకు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే రైతులు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ప్రతులను రైతు భరోసా దరఖాస్తు ఫారానికి జతపరచి తమ గ్రామ వ్యవసాయ విస్తరణాధికారికి సమర్పించాలని తెలిపారు. అలాగే బ్యాంక్ ఖాతా వివరాల్లో మార్పులు చేయాలనుకునే రైతులు వెంటనే తమ గ్రామ ఏఈఓను సంప్రదించి వివరాలు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే రైతు భరోసా లబ్ధి పొందుతున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం రైతులు తమ గ్రామ ఏఈఓ లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.లాభాలుఖరీఫ్ మరియు రబీ సీజన్లకు ఎకరానికి రూ.5,000 చొప్పున.విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు ఉపయోగం.రుణాల భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకత పెంచడం. అర్హతతెలంగాణలోని అర్హ రైతులు (60 లక్షలకు పైగా) ప్రయోజనం పొందుతారు. ధరణీ పోర్టల్‌లో భూమి వివరాలు లింక్ చేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తు:**rythubandhu.telangana.gov.in.** ఈ కార్యక్రమంలో ఏఈవోలు వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఉచిత మెగా ఆరోగ్య శిబిరం విజయవంతం









**మెండోరా: మార్చి/23 (ప్రజా జ్యోతి):** ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెండోరా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బుట్టడి ప్రమోద్ కుమార్ ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని డాక్టర్ స్వాతి వినూత్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు.ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించారు. స్త్రీల ఆరోగ్య సమస్యల కోసం గైనకాలజిస్టులు, చిన్నపిల్లల కోసం శిశు వైద్యులు, కంటి సమస్యల కోసం అప్తల్మాలజిస్టులు, ఎముకల సమస్యల కోసం ఆర్థోపెడిక్ నిపుణులు, పంటి సమస్యల కోసం డెంటల్ వైద్యులు సేవలు అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడం లక్ష్యమని వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇటువంటి శిబిరాలు ఎంతో ఉ పయోగకరమని అధికారులు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను తరచుగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మిట్టపల్లి రాజేశ్వర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీందర్, తహసిల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎస్సై జాదవ్ సుహాసిని, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేణుగోపాల చారి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

### "విప్లవ వీరుల త్యాగస్ఫూర్తితో
# బాధ్యతగల పౌరులుగా ఎదగాలి"

– షాహిద్ దివస్ సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో ఘన నివాళులు



**నిజామాబాద్ రూరల్: మార్చ్, 23 (ప్రజా జ్యోతి)** దేశ స్వాతంత్ర్యం కోసం తమ నవయౌవనాన్ని అర్పించి, త్యాగాన్ని అగ్నిజ్వాలగా దహించుకుంటూ, దేశభక్తిని దీప్తిగా వెలిగించిన విప్లవ వీరులు భగత్ సింగ్, శివరామ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్ల త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సత్యశోధక్ పాఠశాల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య అన్నారు. విప్లవ మహావీరుల 95వ వర్ధంతి (షాహిద్ దివస్) సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వీరమరణం పొందిన అమరవీరులను స్మరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, స్వేచ్ఛ కోసం ఉరికంబాలను సైతం చిరునవ్వుతో ఆలింగనం చేసిన ఈ మహనీయుల త్యాగాలు భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. అణచివేతకు ఎదురు నిలిచి, న్యాయం కోసం నిర్భయంగా పోరాడిన వారి ధైర్యసాహసాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. వారి విప్లవాత్మక ఆలోచనలు, దేశభక్తి భావాలు సమాజంలో న్యాయం, సమానత్వం, బాధ్యత వంటి విలువలను బలపరుస్తాయని చెప్పారు. అమరవీరుల ఆశయాలను ఆచరణలో పెట్టి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడం ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని స్పష్టం చేశారు.యువత దేశభక్తిని మాటల్లోనే కాకుండా కార్యాచరణలో చూపిస్తూ, సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.విప్లవ వీరుల త్యాగస్ఫూర్తి తరతరాలకు ప్రేరణగా నిలుస్తూనే ఉంది. వారి ఆశయాలను నిలబెట్టడం ప్రతి భారతీయుడి బాధ్యతగా భావించాలి. అని అన్నారు.

## ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల పరిష్కారం

– పోలీస్ కమిషనర్ సాయి చైతన్య
– ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు
– సంబంధిత అధికారులకు సూచనలు










**నిజామాబాద్ రూరల్: మార్చ్, 23 (ప్రజా జ్యోతి )** నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల సమస్యలను కమిషనర్ స్వయంగా వినిపించుకొని, వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అవసరమైన చోట వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్.ఐలు, సి.ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకొని, పరిష్కార మార్గాలను సూచించారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల అవసరం లేకుండా, పైరవీలు లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను చెప్పుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను పారదర్శకంగా పరిష్కరించడం, శాంతి భద్రతలను కాపాడడం పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, వేగవంతమైన పరిష్కారం అందిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను పరిష్కరించే ప్రజావాణి కార్యక్రమం, పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పొందిస్తుందని అన్నారు.

# పేదల ఆరోగ్యానికి సర్కార్ భరోసా: ఆవుల రాజిరెడ్డి

– 58.87 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ – నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి..!



నర్సాపూర్ (ప్రజాజ్యోతి) పేద ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ, వైద్య ఖర్చుల భారం ప్రభుత్వం భరించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని టీపీసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణ పరిధిలోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా 150 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 58,87,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

**నాడు నిర్లక్ష్యం.. నేడు నమ్మకం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ బడ్జెట్లు రూపొందించినప్పటికీ, పేదల ఆరోగ్యం గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. అప్పట్లో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటే అవి వచ్చే వరకు దేవుడిపైనే భారం వేయాల్సిన పరిస్థితి ఉండేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే వేల సంఖ్యలో చెక్కులను అందజేసిందని తెలిపారు. కేవలం గత నెలలోనే 70 లక్షలకు పైగా విలువైన చెక్కులను పంపిణీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి పారదర్శకంగా, త్వరితగతిన ఆర్థిక సాయం అందేలా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని కొనియాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు రాజిరెడ్డి స్వయంగా చెక్కులను అందజేశారు. "ప్రజా పాలనలో పేదల సంక్షేమమే మా లక్ష్యం. ఆసుపత్రి ఖర్చుల కోసం అప్పుల పాలైన కుటుంబాలను ఆదుకోవడంలో ఈ నిధులు కొండంత అండగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

– తహసిల్దార్ శ్రీనివాస్



నర్సాపూర్ (ప్రజాజ్యోతి) మండల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ముఖ్యంగా భూ సమస్యలు, ధరణి సవరణలు, కొత్త రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మరియు బాధితులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ

# భవనం, సీసీ రోడ్లకు భూమి పూజ

– మార్కెట్ కమిటీ చైర్మన్ అలవేణి, నర్సింహారెడ్డి – ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు



కొండాపూర్ ప్రజా జ్యోతి పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మెన్ మన్క అలవేణి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం కొండాపూర్ మండల పరిధిలోని మాన్సాన్పల్లిలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు 20లక్షలతో గ్రామ పంచాయితీ భవన నిర్మాణం పనులకు మార్కెట్ కమిటీ చైర్మెన్ అలవేణి నరసింహారెడ్డి, ఆత్మకమిటీ చైర్మెన్ వై.ప్రభు గ్రామ సర్పంచులు కలిసి భూమిపూజ చేశారు. మాందాపూర్ గ్రామంలో పంచాయితీ భవన నిర్మాణం పనులకు 20లక్షలతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచంద్రారెడ్డి, ఎంపిడిఓ వేణుగోపాల్, పిఆర్ఎఇ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లేశం, రాంచంద్రయ్య, యాదయ్య పంచాయితీ కార్యదర్శిలు నవీన్, అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షులుశేఖర్ గ్రామ పెద్దలు వార్డు మెంబర్లు గ్రామస్థులున్నారు.

## గొల్లపల్లిలో అంబేద్కర్ జయంతి

# సందర్భంగా ముందస్తు క్రికెట్ టోర్నమెంట్

– క్రికెట్ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ శ్రీనివాస్






కొండాపూర్ ప్రజా జ్యోతి బాబా సాహెబ్ అంబేద్కర్ సందర్భంగా ముందస్తుగా మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ వాల్ పోస్టర్ను గ్రామ సర్పంచ్ గడిల శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు, అలాగే నూతనంగా ఏర్పాటుచేసిన సంఘం లెటర్ ప్యాడ్ ను, క్రికెట్ టోర్నమెంటు యొక్క నమూనా పత్రాన్ని సోమవారం అంబేద్కర్ యువజన సంఘం గ్రామ సర్పంచ్ తో కలిసి ఆవిష్కరణ చేశారు.క్రికెట్ టోర్నమెంట్ కు సహకరించిన గ్రామ సర్పంచ్ గడిల శ్రీనివాస్ గౌడ్ కి అంబేద్కర్ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ తేదీలు. ఏప్రిల్ 11,12 న ప్రారంభం.

## బూరుగుపల్లిలో రక్తదాన

# శిబిరం నిర్వహించిన సర్పంచ్ సాయిలు






హవెలిఘనపూర్ (ప్రజాజ్యోతి)మార్చి 23: మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మైత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బూరుగుపల్లి గ్రామానికి చెందిన చెవ్వ శరత్ బాబు కుమార్తె కీర్తన గత 28 రోజులుగా హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆమెకు సహాయార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయిలు, వివిధ గ్రామాల యువకులు, మైత్రి బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలి





సిద్దిపేట రూరల్ , మార్చి 23, (ప్రజాజ్యోతి): భగత్ సింగ్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని సమాజ మార్పు కోసం ముందుకు రావాలని యూ ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య సమరంలో అజరామరులైన భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా వీరుల త్యాగాలను కేవలం వర్ధంతి రోజునే గుర్తు చేసుకోవడం కాకుండా, వారి ఆశయాలను నిత్యం ఆచరణలో పెట్టాలని సూచించారు. విద్యార్థి ఉద్యమాలు సమాజ మార్పుకు కీలక శక్తిగా మారాలని, విద్యార్థులు ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూ ఎస్ ఎఫ్ ఐ నాయకులు నాచారం శేఖర్, గుడికందుల రవి, విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారతదేశ అమరవీరుల దినోత్సవం

# సందర్భముగా అమరజీవి భగత్ సింగ్ జీవిత చరిత్ర






I hereby certify that the sentence of death passed on Bhagat Singh has been duly executed, and that the said Bhagat Singh was accordingly hanged by the neck till he was dead, at Lahore C. Jail on Monday the 23rd day of March 1931; that the body remained suspended for a full hour, and was not taken down until life was ascertained by a medical officer to be extinct; and that no accident, error or other misadventure occurred.

Superintendent of the Jail at




కల్హే ర్. 23. మార్చి. (ప్రజా జ్యోతి..) సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రలో భారతదేశ స్వతంత్రం స్వతంత్రం కొరకు తన ప్రాణాలను తృణప్రాయారణంగా అర్పించిన మహా అమరుడు భగత్‌సింగ్ జీవితం ఒక చిన్న వయసులోనే మొదలైన గొప్ప విప్లవ గాథ. ఆయన కథని జననం నుంచి త్యాగం వరకు క్రమంగా చూద్దాం..జననం, కుటుంబం, చిన్ననాటిభగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న పంజాబ్‌లోని లయల్‌పూర్ జిల్లా బంగా గ్రామంలో (ఈరోజు పాకిస్థాన్‌లో) జన్మించాడు. ఆయన తండ్రి కిషన్ సింగ్, మామ అజిత్ సింగ్ ఇద్దరూ స్వాతంత్ర్య ఉద్యమకారులు కావడంతో ఇంట్లోనే దేశభక్తి వాతావరణం ఉండేది. 1919లో జరిగిన జలియన్‌వాలా బాగ్ నరమేధం ఆయన చిన్న మనసుకు గట్టి దెబ్బ కొట్టింది; ఆ ఘటన తర్వాత బ్రిటిష్‌లను దేశం నుంచి తరిమేయాలనే సంకల్పం ఇంకా బలపడింది. భగత్ సింగ్ .విద్య, దేశభక్తి వైపు మలుపులాహోర్‌లోని నేషనల్ కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఆయన విప్లవ ఆలోచనలతో, సామాజిక న్యాయం భావాలతో మరింతగా మమేకమయ్యాడు. మహాత్మా గాంధీ ప్రారంభించిన అసహకార ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ, తర్వాత చౌరి చౌరా ఘటన తర్వాత గాంధీ ఉద్యమం విరమించడంతో ఆయనకు విప్లవ మార్గం అవసరం అని అనిపించింది. ఇంట్లో పెళ్లి ఒత్తిడి రావడంతో "నా జీవిత లక్ష్యం దేశ స్వాతంత్ర్యం; గృహసుఖాలు నాకు అవసరం లేదు" అని ఒక లేఖ రాసి ఇల్లు విడిచిపెట్టాడువిప్లవ సంస్థలు, సిద్ధాంతాలుభగత్‌సింగ్ హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ (హస్ర ) లో చేరి, యువ విప్లవకారుల ప్రధాన నాయకుడిగా ఎదిగాడు. విప్లవం అంటే కేవలం బాంబు, తుపాకీ కాదని; సమానత్వం, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించే ఆలోచనల మార్పు కావాలని ఆయన నమ్మకం. మార్క్సిజం, సోషలిజం పుస్తకాలు విస్తృతంగా చదివి, భారత భవిష్యత్తు గురించి తాత్వికస్థాయిలో ఆలోచించాడు.వాల్ పెయింటింగ్ ఇన్ రివాల్సర్ , హిమాచల్ ప్రదేశ్ , దీపిక్ట్స్ భగత్ సింగ్ ఇన్ ఏ ఫెడోరా ఎగైనెస్ట్ ది ఇండియన్ ఫ్లాగ్ , విత్ ఏ హిందీ కృపోతే అట్రిబ్యూటెడ్ టూ హిం బీలో .లాలా లజపత్‌రాయ్‌కి ప్రతీకారం -- సాండర్స్ హత్య1928లో సైమన్ కమిషన్‌కి వ్యతిరేకంగా లాహోర్‌లో జరిగిన నిరసన ప్రదర్శనలో బ్రిటిష్ పోలీసులు లాలా లజపత్ రాయ్‌పై క్రూరంగా లాఠీ దాడి చేసి, కొద్ది రోజుల తర్వాత ఆయన మరణించారు. . "లాఠీ దెబ్బలు నా శరీరంపై పడలేదు, భారత హృదయంపై పడ్డాయి" అన్న లాలాజీ మాటలు భగత్‌సింగ్‌ను బాగా కదిలించాయి. లాయిడ్ హత్య చేయాలనుకుని వెళ్లిన భగత్‌సింగ్ బృందం, పొరబాటున పోలీసు అధికారి జాన్ సాండర్స్‌ను 1928 డిసెంబర్‌లో కాల్చి చంపింది. తర్వాత అతను మారువేషంలో లాహోర్‌ని విడిచి దూరమయ్యాడు; ఈ ఘటనతో ఆయన పేరు దేశవ్యాప్తంగా. 1927.అసెంబ్లీ బాంబు సంఘటన1929 ఏప్రిల్ 8న ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో బ్రిటిష్‌లు తీసుకురాబోయే కఠిన చట్టాలకు వ్యతిరేకంగా నిరసనగా భగత్‌సింగ్, బటుకేశ్వర్ దత్‌తో కలిసి బాంబులు విసిరారు. "విప్లవం జిందాబాద్" అనే నినాదం వినిపిస్తూ, బాంబులు పేలేలా చూసినా, ఉద్దేశపూర్వకంగా ఎవరినీ చంపకుండా, కేవలం దృష్టి ఆకర్షించేలా తక్కువ శక్తి ఉన్న బాంబులను వేసారు. వెంటనే అక్కడే తాము లొంగిపోయి అరెస్టు అయ్యారు, ఎందుకంటే ఆయన లక్ష్యం తన ఆలోచనలను కోర్టు ద్వారా జనాల్లోకి తీసుకెళ్లడమే. హుంజర్ స్ట్రైక్ పోస్టర్ ఫీచరింగ్ స్ . భగత్ సింగ్ అండ్ బి . కే . దత్త విత్ ది టెక్స్ట్ "స్టారవింగ్ టొ డెత్ ఫర్ కంట్రీజ్ హానర్ ."జైలు జీవితం, నిరాహార దీక్షలాహోర్ జైలులో ఉన్న భగత్‌సింగ్, ఇతర రాజకీయ ఖైదీలకు కూడా గౌరవం ఇవ్వాలని, జైలులోని దారుణ పరిస్థితులు మార్చాలని డిమాండ్ చేస్తూ దీర్ఘకాల నిరాహార దీక్షకు దిగాడు. రాజకీయ ఖైదీలకు పుస్తకాలు, వార్తాపత్రికలు, మెరుగైన ఆహారం, బట్టలు ఇవ్వాలి, కూలి పనులు బలవంతంగా చేయించకూడదన్నది వారి ప్రధాన డిమాండ్. ఈ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆయనను "ఆలోచనలు కలిగిన విప్లవకారుడు"గా ప్రజల ముందుకొచ్చేలా చేసింది. "నేను ఎందుకు నాస్తికుడినయ్యాను?" -- ఆలోచనల లోతుజైలు రోజుల్లో భగత్‌సింగ్ "నేను ఎందుకు నాస్తికుడినయ్యాను?" అనే ప్రసిద్ధ వ్యాసం రాశాడు, అందులో దేవుడిపై భక్తి కన్నా మనుషుల బాధ్యత, చైతన్యం ముఖ్యమని తన వాదనను వివరించాడు. శాసనసభలో బాంబు విసిరినట్టు, సాండర్స్ హత్యలాంటివి వ్యక్తిగత ద్వేషం వల్ల కాదు; బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కుదిపే రాజకీయ చర్యలేనని కోర్టులో స్పష్టంగా చెప్పాడు. డైలి మీలాప్ పోస్టర్ ఫ్రమ్ అక్టోబర్ 9, 1930, డీటెయిలింగ్ ది లేహోరే కన్స్పిరేసీ కేసు జడ్జిమెంట్ విత్ పోర్ట్రైట్స్ అండ్ సెంటెన్సస్ అఫ్ ఇండివిడ్యుఅల్స్ ఇన్వాల్వెడ్ .లాహోర్ కుట్ర కేసు, మరణదండనసాండర్స్ హత్య, విప్లవ సంస్థల కార్యకలాపాలపై విచారణ జరిపిన బ్రిటిష్ ప్రభుత్వం భగత్‌సింగ్, రాజ్గురు, సుఖ్‌దేవ్‌లపై "లాహోర్ కుట్ర కేసు" పెట్టింది. విచారణ తర్వాత ముగ్గురికీ ఉరి శిక్ష విధించారు; దేశమంతా క్షమాభిక్ష కోరుతూ పోరాటం చేసినా బ్రిటిష్ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. 1931 మార్చి 23 రాత్రి లాహోర్ జైలులో ఈ ముగ్గురినీ ముందే శిక్ష విధించిన సమయానికి కొద్దిసేపు ముందుగానే రహస్యంగా ఉరి తీయించారు. భగత్ సింగ్ డెత్ సర్టిఫికెట్ , కన్ఫర్మింగ్ హిస్ ఎగ్జిక్యూషన్ బై హంగింగ్ ఆట్ లేహోరే సెంట్రల్ జైలు ఆన్ మార్చి 23, 1931.మరణానంతర గౌరవం, వారసత్వం23 ఏళ్ల వయసులోనే నవ్వుతూ ఉరితాడిని ముద్దాడిన వీరుడిగా భగత్‌సింగ్ పేరు దేశ చరిత్రలో చిరస్మరణీయం అయింది. ఆయనను "షహీద్ భగత్‌సింగ్" అని సంబోధిస్తూ, ప్రతి ఏడాది మార్చి 23న దేశవ్యాప్తంగా ఆయనతో పాటు రాజ్గురు, సుఖ్‌దేవ్ త్యాగాలను స్మరించుకుంటారు. భగత్‌సింగ్ విప్లవం అంటే హింస కాదు, అన్యాయ నిర్మూలన కోసం సమాజాన్ని మళ్లీ మలచే ఆలోచనా ఉద్యమమని చెప్పిన సందేశం ఇప్పటికీ భారత యువతకు ప్రేరణగా నిలిచింది భగత్ సింగ్ , రాజగురు , అండ్ సుఖీదేవ్ హోల్డింగ్ హాండ్స్ విత్ రైజడ్ ఫిస్ట్స్ అండ్ అదోరనెద్ విత్ గార్లండ్స్ నియర్ హుస్సేనివాలా ఆట్ ది ఇండియా -పాకిస్థాన్ బోర్డర్ .ముఖ్య ఘట్టాలు -- సారాంశ పట్టికఇంకా భాగాలవారీగా, ఉదాహరణకు ఆయన రచనలు, ప్రసంగాలు, లేదా ఆయనపై వచ్చిన సినిమాల గురించి కూడా తెలుసుకోవాలని వీటి భారత దేశ యువత దేశ స్వతంత్రం కొరకు ప్రాణాలు పెంచిన భగత్ సింగ్ ఆదర్శంగా తీసుకు ని మించిన అభిప్రాయాలు సూత్రాలను అనుసరించాలని దేశం కొరకు ఎలాంటి వివాలు అనుసరించారు భగత్ సింగ్ సద్గురు యైబ్ ఖాన్ వంటి మహానాయకుల ద్వారా తెలుసుకోవచ్చా అని: భగత్ సింగ్ విస్తృతంగా పాశ్చాత్య, రష్యన్ ఆలోచనలు చదివి మార్క్సిజం, సోషలిజం, అరాజకత్వం వైపు మొగ్గు చూపాడు. ఆయన చదివిన పుస్తకాలు, ఆలోచనలు ఆయన విప్లవ సిద్ధాంతాలకు మూలం. చదివిన ప్రధాన పుస్తకాలుకార్ల్ మార్క్స్, ఫ్రెడ్రిచ్ ఏంజిల్స్ ప్రధాన రచనలు; వీటి ద్వారా కేపిటలిజం విమర్శ చేసి సామ్యవాదాన్ని అర్థం చేసుకున్నాడు. వ్లాదిమిర్ లెనిన్, లియాన్ ట్రాట్స్కి రచనలు -- సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థకు పరాకాష్ట అని లెనిన్ రచనలు జైలు నోట్‌బుక్‌లో ఉపయోగించాడు. మిఖాయిల్ బకునిన్ వంటి అరాజకవాదులు, క్లారా జెట్కిన్ రాసిన లెనిన్ జీవిత చరిత్ర ("రేమినిస్కీన్సెస్ అఫ్ లెనిన్ ") ఉరి తీయే ముందు దీన్ని చదువుతున్నాడని చివరి కోరికలో చెప్పాడు. ప్రభావితం చేసిన ఆలోచనలుసోషలిజం, మార్క్సిజం: అసమానతలు లేని సమాజం, పాశ్చాత్య అరాజకవాదాల ప్రభావంతో విప్లవం ఆలోచనల మార్పు అని నమ్మాడు. విప్లవం అంటే బాంబులు కాదు, కానికరం లేని విమర్శ, స్వతంత్ర ఆలోచనలు; మానవ బాధ్యత ముఖ్యమని రాశాడు. దేవుడు, మతాలు వద్దు: "నేను ఎందుకు నాస్తికుడినయ్యాను?" వ్యాసంలో శాస్త్రీయ దృక్పథం, అనాగరిక ఆలోచనలు వద్దని వాదించాడు.. ప్రతి భారతీయ గుండెలలో నిలిచిన మహానీయుడు అమర జీవి భగత్ సింగ్ ప్రతి ఒక్క యువత భగత్ సింగ్. రాజ్ గురు సుఖదేవ్. లాంటి అమర వీరులు తాగేయాలను మరువకూడదు అని సత్ప్రవర్తన సన్మార్గం ఎదురుద్దీ నిలబడే గుణం కేవలం యువతకే సాధ్యమైంది కావున దేశానికి సాధ్యమైనంత వరకు సేవ చేయాలని పుస్తకాల ద్వారా తెలిసిన జ్ఞానాన్ని అందిస్తున్న వక్త సారాంశం. సారాంశంలో ఏమైనా తప్పులు ఉంటే క్షమించి సవరించుకోగలరని మనవి.

# అత్యాచార కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష



**పరిగి, మార్చి 23 (ప్రజా జ్యోతి) :** పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన అత్యాచార కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కారాగార శిక్ష విధించింది. అలాగే రూ.12,000 జరిమానా కూడా విధిస్తూ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించిన వివరాల ప్రకారం, పరిగి మండలం బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య (37)పై అత్యాచారంతోపాటు బెదిరింపుల (ఐపీసీ సెక్షన్లు 376, 506) కింద 2016లో కేసు (క్రైమ్ నెం. 268/2016) నమోదు అయింది. ఈ కేసు విచారణ అనంతరం నిందితుడు దోషిగా తేలడంతో న్యాయమూర్తి చౌదరి చంద్ర కిషోర్ 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, న్యాయవాదులను ఎస్పీ అభినందించారు. దర్యాప్తు అధికారులు వై. నాగేష్, పి. ప్రసాద్, ప్రస్తుత సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ మోహన్ కృష్ణలతో పాటు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెరాజ్ ఫిర్దౌస్, సీడీవో జగన్ మోహన్ రెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ నిరంజన్ గౌడ్ పనితీరును ఎస్పీ ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, నేరస్థులు చట్టం నుంచి తప్పించుకోలేరని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# గ్రామ అభివృద్ధి దిశగా మంది పాల్ సర్పంచ్

**- నూతన సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ నాగరాజు..**



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) మార్చి 23 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో సర్పంచ్ నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని ఏంజీఎన్ఆర్ఇజీఎస్ కింద



సిసి రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...మందిపల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అన్నారు. గ్రామ అభివృద్ధికీ ప్రతీ ఒక్కరు సహకరించి అభివృద్ధినీ కొనసాగించాలని అన్నారు. గ్రామంలో ఎక్కడ ఇబ్బందులు,ఇతర సమస్యలు ఉంటే నా దృష్టికీ తీసుకురండి వాటిని తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నడ్డి మనీషా నవీన్, వార్డు సభ్యులు రమాదేవి, మల్లయ్య, చందు, విజయ్ కుమార్, నర్సింలు, కుమార్, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వరూప్ రెడ్డి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చిన అధ్యక్షుడు పంగ మహేందర్ రెడ్డి



**ఉప్పల్ మార్చి 23 ప్రజా జ్యోతి :** సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ రాధిక గుప్తలో మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరము స్వరూప్ రెడ్డి కాలనీలో గల సమస్యలను కాలనీ సంక్షేమ సంఘంతో కలిపి వివరించడం అయినది, మా సమస్యలు విన్నవెంటనే పై అధికారులకు చెప్పి సమస్యలను వెంబడే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అన్న వెంకటేష్ జ్ఞానేశ్వర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు,,

# మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసింది

**- బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**



**కూకట్ పల్లి, మార్చి 23 (ప్రజా జ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్, భూదేవి హిల్స్ కాలనీలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ను తన నివాసం వద్ద జగద్గిరిగుట్ట పోలీసులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పోనివ్వకుండా ఉదయాన్నే నిద్రలేపి అక్రమ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేదోళ్ల బ్రతుకులు మారుస్తామని చెప్పి 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రేస్ పార్టీ గ్యారంటీలను గాడి తప్పించి ఇప్పుడు పేదోళ్ల పొట్టకొట్టే విధంగా వ్యవహరిస్తున్నది అన్నారు. కాంగ్రెస్ ముమ్మాటికి ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి సర్కార్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది అన్నారు. 6 గ్యారంటీలను పక్కనపెట్టి హైడ్రా ను తీసుకొచ్చి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడి రాక్షసానందం పొందిన దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అన్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్న వివిధ డివిజన్ లలో సమస్యలు చెత్తకుప్పల పేరుకుపోయాయని గత కార్పొరేటర్లు తాజా మాజీలు అయ్యారే తప్ప డివిజన్లను తాజాగా చేయలేదన్నారు. ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకొని మోసపూరిత వాగ్దానాలిచ్చి ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్ నాయకులను మూడు కార్పొరేషన్లలో ఉన్న ప్రజలు తరిమికొట్టాలని అన్నారు.

# భగత్ సింగ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి...

**- భగత్ సింగ్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి - ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్**




**పరిగి, మార్చి 23 (ప్రజాజ్యోతి) :** భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కొన్ని పేర్లు కాలానికతీతంగా నిలిచిపోతాయని, అలాంటి మహోన్నతమైన వ్యక్తులలో భగత్‌సింగ్ ప్రముఖుడని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ అన్నారు. పరిగి పట్టణ కేంద్రంలోభగత్ సింగ్, రాజగురు, సుఖ్దేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా అనిల్ మాట్లాడుతూ చరిత్రలో భగత్‌సింగ్ పేరు ఒక ఉద్వేగం, ఒక ఉత్తేజం. కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన యువ కిశోరం. ఆయన జీవితకాలం కేవలం 23 సంవత్సరాలే అయినప్పటికీ, ఆయన ఆలోచనలు శతాబ్దాలుగా భారత యువతను ప్రభావితం చేస్తూనే ఉన్నాయని అన్నారు. 1931 మార్చి 23న భగత్‌సింగ్‌ను, ఆయన సహచరులు శివరామ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసిందని ఆ రోజు భారతదేశ చరిత్రలో ఒక విషాద దినంగా ప్రతి ఏడాది మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి (షహీద్ దివస్) సందర్భంగా దేశం ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూనే ఉంటుందని తెలిపారు. భగత్‌సింగ్ వీరమరణం పొందిన విప్లవకారుడు మాత్రమే కాదని ఆయన గొప్ప మేధావి, బహుభాషా కోవిదుడు, నిశితమైన పాఠకుడు, ఆలోచనాపరుడు, రచయిత, సమాజ విశ్లేషకుడని తెలిపారు. కులం, మతం, ఆర్థిక అసమానతలు అంతం కావాలని, శ్రమజీవుల రాజ్యం రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిగి డివిజన్ అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి కలీం, ఉపాధ్యక్షుడు భాను, సహాయక కార్యదర్శి సుమేరు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి మిత్రునికి ఘన నివాళి

**బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం**



**యాలాల్ మార్చ్ 23 ప్రజా జ్యోతి :** యాలాల మండలంలో విషాదం చోటుచేసుకుంది. చిన్ననాటి స్నేహితుడు, సహాధ్యాయి, మంచితనానికి ప్రతీకగా నిలిచిన షాబుద్దీన్ మరణ వార్తతో అతని మిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ సంగెం అనంతయ్య, కమల్‌పూర్ మహిపాల్ రెడ్డి, వార్ల రాజేందర్, పెండ్యాల రాములు, పెండ్యాల శ్రీనివాస్, హరిచ్చందర్ టీచర్, నబీ సాబ్, కొక్కల్ల ప్రకాష్ తదితర మిత్రులు యాలాల మండల పరిధిలోని దేవనూర్ గ్రామానికి చేరుకుని తమ చిన్ననాటి మిత్రుడు షాబుద్దీన్ పార్థివ దేహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ గుప్తా మాట్లాడుతూ, చిన్ననాటి నుండి కలిసి చదువుకొని, ఆటపాటల్లో పాల్గొన్న మిత్రుడు ఇక లేడనే వార్త తమను తీవ్రంగా కలచివేసిందని భావోద్వేగానికి గురయ్యారు. షాబుద్దీన్ ఆత్మకు అల్లా శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. మిత్ర బృందం కలిసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమారుడు కిరణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశన్న, సీనియర్ నాయకులు వెంకటయ్య, దేవులతాండ సర్పంచ్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకుడు ఎలిమినేటి నరసింహారెడ్డి అరెస్ట్

**- ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే అక్రమ అరెస్టులా - కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ ఎలిమినేటి నరసింహారెడ్డి**




**అబ్దుల్లాపూర్ మెట్టు మార్చి 23 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తూ బిజెపి పార్టీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. ఈ క్రమంలో బిజెపి పార్టీ నాయకత్వం పిలుపునందుకొని తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నాయకులు శ్రేణులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పోలీసులు బిజెపి పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి ప్రజలకు అమలు కాని హామీలను ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి మోసం చేసిందన్నారు. బిజెపి పార్టీ కొత్తగా ప్రజలకు ఏమి చేయాలని డిమాండ్ చేయడం లేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రమే నెరవేర్చాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యగా ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే ఇంటికి పంపించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బిజెపి పార్టీ తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేదని విషయాన్ని గ్రహించాలని అన్నారు.

# గోపనపల్లిలో అక్రమ నీటినీ ట్యాంకర్ల ద్వారా తరలింపు

**- తీవ్ర తాగునీటి సంక్షోభం ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు**

**శేరిలింగంపల్లి, మార్చ్ 23 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని వాణిజ్య అవసరాల కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావంతో భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం (23-03-2026) గోపనపల్లి గ్రామస్థులు



శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, సురేందర్, శివకుమార్,వేణు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోపనపల్లిలో అక్రమ నీటినీ ట్యాంకర్ల ద్వారా తరలింపు

**రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డు అందుకున్న కర్క నాగరాజు**




**కూకట్ పల్లి, మార్చి 23 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ కు చెందిన కూకట్ పల్లి నియోజకవర్గం ఐ ఎన్ టి యు సి, పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కర్కనాగరాజు కు అత్యంత ప్రతిష్టాత్మికమైన రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డు 2026 అందుకున్నారు. కలకత్తా నగరం లోని బెహెల శరత్ సదన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమం లో కర్కనాగరాజు కు అవార్డును భారత మాజీ ఫుట్ బాల్ ప్లేయర్ మెహతాబ్ హుస్సేన్ చేతుల మీదుగా అందుకున్నారు. సోషల్ సర్వీస్, ట్రేడ్ యూనియన్ లీడర్షిప్ కేటగియరీ లో ఎంపికయ్యారు. అనంతరం అవార్డు గ్రహీత కర్కనాగరాజు మీడియా ప్రతినిధిలతో మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ తను చేసిన సామజిక సేవలు, ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మికులకు చేస్తున్న సేవలను గుర్తించి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు నన్ను రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డుకు ఎంపిక చేసినందుకు వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ అవార్డు తో నా పై మరింత భాధ్యత పెరిగిందన్నారు. ఈ రోజు నాకు చాలా గర్వంగా, భావోద్వేగంగా ఉంది. రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డు 2026 అందుకోవడం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, నా ప్రయాణంలో నాకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరి సమిష్టి కృషికి గుర్తింపు. కలకత్తా నగరంలో మాజీ భారత మాజీ ఫుట్ బాల్ ప్లేయర్ మెహతాబ్ హుస్సేన్ నుండి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం నాకు చాలా గౌరవంగా ఉంది. ఈ క్షణం నా జీవితంలో అత్యంత చిరస్మరణీయమైన మైలురాళ్లలో ఒకటిగా నిలిచిపోతుంది. సామాజిక సేవ, ట్రేడ్ యూనియన్ నాయకత్వం కోసం ఈ అవార్డు కార్మికుల సంక్షేమం, సమాజ అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పనిచేయాలనే నా నిబద్ధతను బలపరుస్తుంది. నాయకత్వం అనేది పదవి గురించి కాదు, బాధ్యత, అంకితభావం, సేవ గురించి అని నేను గట్టిగా నమ్ముతున్నాను. ప్రతి సవాలులో నాకు తోడుగా నిలిచిన కార్మికులు, మద్దతుదారులు, నా కుటుంబ సభ్యులందరికీ నేను ఈ గౌరవాన్ని అంకితం చేస్తున్నాను. వారి ప్రోత్సాహం, నమ్మకం నా గొప్ప బలం. నా ప్రయత్నాలను గుర్తించినందుకు అవార్డు నిర్వాహకులకు కూడా నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ గుర్తింపు నన్ను మరింత అభిరుచి, సమగ్రతతో పనిచేయడం కొనసాగించడానికి ప్రేరేపిస్తుంది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెంగాలీ సినీ నటులు, రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా అరెస్టుల పర్వం

**బీజేపీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మర్నేని ఫణీంద్ర అరెస్ట్**

**ఉప్పల్ మార్చ్ 23 ప్రజాజ్యోతి :** ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి నిరసనగా సోమవారం ఉదయం 11:35 గంటలకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం లో అసెంబ్లీ సాక్షిగా ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మర్నేని ఫణింద్రను నామ శ్రవణ్ ను వెంకట్ సాయి ముదిరాజ్‌ను అక్రమంగా అరెస్ట్ చేసారు. ఈ సం దర్భంగా ఫణింద్ర మాట్లాడుతు అవినీతి అరాచక కమీ షన్ల పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు యన్ రాంచందర్ రావు పిలుపునివ్వడంతో అసెంబ్లీ ముట్టడించడానికి ఉప్పల్ డివిజన్ నుండి వచ్చామని మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ పాలకుల మెడలు వంచుతాం అని కాంగ్రెస్ గద్దె దిగే వరకు పోరాటం ఆగదని అని అన్నారు.



# అమరవీరుల వర్ధంతి సందర్భంగా యువ భారత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**పరిగి, మార్చి 23 (ప్రజాజ్యోతి) :** పరిగి పట్టణ కేంద్రంలో అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా యువ భారత్ వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పల్లవి డిగ్రీ కళాశాల నుండి కొడంగల్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో అతి చిన్న వయసులోనే అలుపెరుగని పోరాటం చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఈ మహానుభావుల త్యాగాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని అన్నారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన వారి బలిదానాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా ఆఫీసర్ శ్రీశైలం, పల్లవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కోచ్ నారాయణ గౌడ్, పెంటయ్య గుప్తా, అనిల్ గౌడ్, ముకుంద నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని అమరవీరుల జయధ్వానాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి...

**హాజరైన మండల అధికారులు**




**పరిగి, మార్చి 23 (ప్రజాజ్యోతి) :** పరిగి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జి.సుబ్రహ్మణ్యం (డిప్యూటీ. ఇఇ, యంబి ఇంట్రా), కె.సింధు (ఐసిడియస్ పర్యవేక్షకురాలు (గ్రేడ్-1), ఎం.అంజయ్య (యంఇఒ), ఎస్.ఉష (అడిషనల్. పిఒ), ఎస్.లక్ష్మీకాంత్ రెడ్డి (జూనియర్ అసిస్టెంట్ - రెవెన్యూ), పి.రాజు (ఏపియం), బి.రోజా (ఏఇ, గృహనిర్మాణ శాఖ), ఆర్. హరికృష్ణ (ఏఇ, విద్యుత్ శాఖ, పరిగి), సి.విజయ్ కుమార్ (ఏఇఓ, వ్యవసాయ శాఖ, పరిగి) తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు.

# పరిగి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పునఃసమీక్షకు చర్యలు వేగవంతం..

**- ఎస్ఐఆర్‌పై నేడు శిక్షణ కార్యక్రమం**

**పరిగి, మార్చి 23 (ప్రజా జ్యోతి):** పరిగి నియోజకవర్గం పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃసమీక్ష (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల నమోదు అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎలక్టోరల్ మ్యాపింగ్, అలాగే సహాయ ఎన్నికల నమోదు అధికారులు, తహసీల్దార్లు, బూత్ లెవల్ అధికారులు అలాగే బూత్ లెవల్ ఏజెంట్లకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు నేడు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వబడినట్లు సమాచారం. ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని పెంచడం, కొత్త ఓటర్ల నమోదు, తప్పులు సవరించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తికావడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల నమోదు అధికారి సూచించారు.

# బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి

**ఎస్కేడికేపై యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం**




**కూకట్ పల్లి, మార్చి 23 (ప్రజా జ్యోతి) :** వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మోటిపల్లి భరత్ కుమార్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి డివిజన్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఎస్ కేడి కే వై యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనునిత్యం రద్దీగా ఉండే టెంపుల్ బస్‌స్టాప్‌లో బాటసారిలకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, తుమ్మల మోహన్ కుమార్, సాయి, సందీప్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి' దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,మార్చి 23( ప్రజాజ్యోతి ) ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు.



మొత్తం 233 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ లో ఉంచవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి : ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి

కరీంనగర్ టౌన్,మార్చి 23: దేశ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ స్ఫూర్తితో యువత మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి పిలుపునిచ్చారు.భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కరీంనగర్ నగరంలోని భగత్ సింగ్ విగ్రహానికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబటి జోజి రెడ్డిమాట్లాడారు. భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం కోసం భగత్ సింగ్ చేసిన పోరాటం నేటికీ ప్రాసంగికమని ఆయన అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్యాయం, అసమానతలపై యువత చైతన్యంతో ముందుకు రావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు అవసరమని సూచించారు.దేశ అభివృద్ధి, ప్రజల హక్కుల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు భగత్ సింగ్ జీవితంపై చర్చలు, వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, నగర అధ్యక్షుడు సత్యరావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ ముట్టడికి ముందే బీజేపీ నాయకుల అరెస్ట్


మేడిపల్లి,మార్చి23: ప్రజా జ్యోతి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో మేడిపల్లి మండల భారతీయ జనతా పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.అరెస్టైన వారిలో మేడిపల్లి మండల అధ్యక్షుడు చిట్యాల సురేష్, పార్లమెంట్ కో–కన్వీనర్ క్యాతం దశరథ్ రెడ్డి, భీమారం మండల అధ్యక్షుడు నాగం శివకుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నాడి జగపతి రెడ్డి, సీనియర్ నాయకుడు తాటిపల్లి జగన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోస్కి మధు ఉన్నారు.అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునే ఉద్దేశంతో ఈ ముందస్తు అరెస్టులు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి..

## పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్...

జగిత్యాల ప్రతినిధి,మార్చి23,(ప్రజాజ్యోతి) కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను కలెక్టర్ సత్యప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతోపాటు ,జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 46 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# రైతు పక్షపాతి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## వారం రోజుల్లో మక్కల కొనుగోలు కేంద్రానికి ఎమ్మెల్యే హామీ

చొప్పదండి, మార్చి 23 ( ప్రజా జ్యోతి): ఆరుగాలం చెమటోడ్చి కష్టపడి పనిచేసి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు ఎలాంటి అవస్థలు పడకూడదన్నదే ఎమ్మెల్యే ముఖ్య ఉద్దేశ్యమని చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ అన్నారు. ధాన్యాన్ని దర్జాగా గిట్టుబాటు ధరకు అమ్ముకొని రైతులు లాభాలు గడించి, రైతే రాజుగా జీవించాలన్నదే ఎమ్మెల్యే ఆశయమన్నారు. కొత్త మొక్కజొన్న పంట కోతకు వచ్చే సమయం వచ్చినందున రైతులు తమ పంటను తొందరపడి తక్కువ ధరలకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరకు అమ్ముకొని ఎక్కువ లాభాలు పొందాలని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రాన్ని వారం రోజుల్లోపు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. గతంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన విధానం,వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న స్థలం రైతుల ధాన్యం పోసుకోవడానికి సరిపోక ఇబ్బందులు పడిన విషయం విధితమేనన్నారు. రైతులు తనతో తమ గోడు వెళ్ళబుచ్చుకోగా ఆ విషయాన్ని ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ లో ఉన్న స్థలాన్ని కూడా ధాన్యం ఆరబోసుకోవడానికి కలెక్టర్, పై అధికారులతో మాట్లాడి రైతుల పక్షాన నిలబడి ఎమ్మెల్యే రైతు పక్షపాతి గా నిలిచారని కొనియాడారు. ప్రస్తుతం కూడా రైతుల కోరికను రైతుల పక్షాన ఎమ్మెల్యే కు విన్నవించామన్నారు. ఎమ్మెల్యే సత్యం సానుకూలంగా స్పందించి వారం రోజుల్లోపు మార్కెట్ యార్డ్ లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రైతుల పక్షాన మార్కెట్ కమిటీ తరపున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు పెరుమాండ్ల రవీందర్, ఈర్లస్వామి,చిలుక సంజీవ్, పత్తిపాక నరేష్, యాంసాని సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మార్చి – 23 (ప్రజాజ్యోతి) సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 167 అర్జీల రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 62, గృహ నిర్మాణ శాఖకు 28, డీఆర్డీఓకు – 19, జిల్లా పంచాయతీ కార్యాలయం 9, ఉపాధి కల్పన అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి 5 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కు 4, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్యాధికారి, జిల్లా సంక్షేమ శాఖ, నీటి పారుదల శాఖ, సెస్ ఎండీకి 3 చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, మైనింగ్ శాఖ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయం, లీడ్ బ్యాంక్ మేనేజర్ కు 2 చొప్పున, మత్స్య శాఖ అధికారి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, ఈడీఎం, ఈఈ ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, సబ్ రిజిస్టర్ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.



# సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

## నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ బ్యూరో,మార్చి 23( ప్రజాజ్యోతి ) శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగర వ్యాప్తంగా జరగనున్న సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.సోమవారం నగరంలోని 15వ డివిజన్ చింతకుంటలో హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన మేయర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో ఎంపీ నిధులతో నిర్మించనున్న నూతన బోర్‌కు స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్‌తో కలిసి భూమిపూజ చేశారు.

తదుపరి నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, సానిటేషన్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా 27వ తేదీన నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.నగరంలోని 66 డివిజన్లలోని దేవాలయాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, ఆలయ పరిసరాలను శుభ్రపరచాలని మేయర్ ఆదేశించారు. కలుపు మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి అవసరమైన చోట చదును పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.భక్తులకు తగిన వసతులు కల్పించేందుకు ఆలయాల వద్ద వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, అన్నదానం జరిగే ప్రాంతాల్లో రిక్షాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎక్కడా చెత్త కనిపించకుండా పారిశుధ్య చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇంజనీరింగ్, సానిటేషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కళ్యాణ మహోత్సవాలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నగర పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి ఇంటి నుండి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. స్వచ్ఛ ఆటోలు చెత్తను సక్రమంగా వర్గీకరించి సేకరిస్తున్నాయా అన్నదాన్ని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, ఎంహెచ్‌వో సుమన్, డీఈలు దేవేందర్, అరుణ్ కుమార్, ఓం ప్రకాష్, వెంకటేశ్వర్లు, ఏఈలు, సానిటేషన్ ఎస్సైలు, జవానులు తదితరులు పాల్గొన్నారు.



# అమరుల దినోత్సవం.

వేములవాడమార్చ్,23:ప్రజాజ్యోతి. భగత్ సింగ్, సుఖ్‌దేవ్ థాపర్, మరియు శివరామ్ రాజ్‌గురులను బ్రిటిష్ అధికారులు 1931 మార్చి 23న రాత్రి 7:30 గంటలకు లాహోర్ సెంట్రల్ జైలులో (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) ఉరితీశారు. ప్రజాగ్రహాన్ని నివారించడానికి ఒక రోజు ముందుగానే ఈ శిక్షను అమలు చేశారు. భారతదేశంలో వారి త్యాగాన్ని అమరవీరుల దినోత్సవంగా (షహీద్ దివస్) జరుపుకుంటారు. లాలా లజపత్ రాయ్ మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి జేమ్స్ స్కాట్‌ను చంపే ప్రయత్నంలో జరిగిన పొరపాటు వల్ల, 1928లో పోలీస్ అధికారి జాన్ సాండర్స్‌ను హత్య చేసినందుకు వారికి శిక్ష పడింది.

ఈ రోజున, వారి అకుంఠిత స్ఫూర్తికి, దేశభక్తికి మనం నివాళులర్పిస్తున్నాము.



# భగవంతరావునగర్ అంగన్వాడీ లెవల్ మానిటరీ కమిటీ సమావేశం.

వేములవాడ,మార్చ్,23:ప్రజాజ్యోతి. భగవంతరావునగర్ లో అంగ న్వాడి సెంటర్ ALMC ( అంగ న్వాడీ లెవల్ మానిటరీ కమిటీ ) మీట్టింగ్ కి 26వ వార్డ్ మామిండ్ల. అమర్ష 27వ వార్డ్ కౌన్సిలర్ . రేగుల. రేణుక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచరు బారతి,వార్డ్ ఆర్.పి. విజయలక్ష్మి,వార్డ్ఆశావర్కర్ మంజులహాజరుకావడంజరిగింది ఈ కార్యక్రమం లో భాగంగా గర్భవతులు, బాలింతలు, పిల్ల లు పాల్గొనడం జరిగింది. 26వార్డ్ కౌన్సిలర్ అమర్ష,27వార్డ్ కౌన్సిలర్ రేగుల. రేణుక, మాట్లా డుచు ప్రభుత్వము బాలింతలకు చిన్న పిల్లలు ఆరోగ్యం కొరకు, పౌష్టిక ఆహారం, కోడిగ్రుడ్లు బాలామృతం ఇస్తుంది వీటిని వాడటం మూలముగాఆరోగ్యంగాఉంటారని పేర్కొన్నారు.మీకుఏమయినా సమ స్యలు ఉంటే మాకుతెలియ జేయాలి అని అన్నారు.



# పోతుగల్ గ్రామంలో సర్పంచ్ తీరుపై ఫిర్యాదు – కలెక్టర్‌కు ఉపసర్పంచ్, వార్డు సభ్యుల వినతి

ముస్తాబాద్, మార్చి 23 ( ప్రజా జ్యోతి ): ఈరోజు పోతుగల్ గ్రామ ఉపసర్పంచ్ మరియు 11 మంది వార్డు సభ్యులు కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ని కలిసి, గ్రామ సర్పంచ్ వ్యవహరిస్తున్న తీరుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. వివరాల్లోకి వెళితే, పెద్దిగారి యాదమ్మ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి గ్రామంలోని వివిధ కార్యక్రమాల విషయంలో ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులకు సరైన సమాచారం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. అంతేకాకుండా, సర్పంచ్ భర్త పెద్దిగారి శ్రీనివాస్ అనవసరంగా వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ నెల 11-03-2026న పోతుగల్ రైతు వేదిక ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించబడింది. గ్రామసభ అనంతరం పాలకవర్గ సభ్యులందరూ కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు మరియు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు వెళ్లగా, మీటింగ్ రూమ్‌కు తాళం వేసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మరియు క్లర్క్‌ను తాళం తీయమని అడగగా, సర్పంచ్ ఆదేశాల మేరకు తాళం తీయలేమని తెలిపారు. అనంతరం సర్పంచ్ ని ఫోన్ ద్వారా సంప్రదించగా, తాను లేకుండా మీటింగ్ రూమ్‌ను ఎవరికీ ఇవ్వబోమని స్పష్టంగా చెప్పినట్లు తెలిపారు. ఈ చర్యతో ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులను అవమానించినట్లైందని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఉపసర్పంచ్ కోల కృష్ణ మరియు 11 మంది వార్డు సభ్యులు కలసి ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో త్వరలోనే విచారణ జరిపించి, ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



# పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికై ప్రభుత్వం కృషి,

## ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతి గది ప్రారంభించిన సర్పంచ్, మండల విద్యాధికారి,

ఎండపల్లి, మార్చి 23, (ప్రజా జ్యోతి ) పూర్వ ప్రాథమిక విద్య ను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని,మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ తెలిపారు, మండలంలోని పడకల్ గ్రామంలో సోమవారం రోజున ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతి గదిని గ్రామసర్పంచ్ బెద్దల ప్రవీణ్ తో కలిసి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ప్రారంభించారు,ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెద్దల.ప్రవీణ్ మాట్లాడుతూ విద్యాశాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్యను గ్రామస్తులు, సద్వినియోగం చేసుకొని మన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు.మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గది ఆకర్షణీయంగా, చూసి నేర్చుకునే విధంగా ఆహ్లాదకరంగా ఉందని, అదేవిధంగా విద్యార్థులకు కావలసిన ఆట సామాగ్రి మొదలైనవి ప్రభుత్వం పంపిణీ చేసి పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తున్న తరుణంలో గ్రామస్తులంతా మన ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులను ఉపయోగించుకోవాలని,నిష్ణాతులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యాభ్యాసం కొనసాగించాలని ఈ సందర్భంగా గ్రామస్తులందరూ గ్రామంలోని పాఠశాల వయస్సు పిల్లలందరినీ మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలనీ గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రవికుమార్ ,ఉపాధ్యాయులు మామిడి.సంతోష్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ జయ, పూర్వ ప్రాథమిక బోధకురాలు తిరుమల ,విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్.

- రూ. 20 లక్షల నిధులతో భవన నిర్మాణం...
-మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు: ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్ , మార్చి23,(ప్రజాజ్యోతి) జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామంలో మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు, తాటిపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి,15లక్షల తో సీసీ రోడ్లు నిర్మాణానికి కు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. మహిళా సంఘాలు తమ సమావేశాలు నిర్వహించుకోవడానికి, వివిధ రకాల శిక్షణలు పొందడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, వారికి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి,సర్పంచ్ బొలిశెట్టిగంగారెడ్డి ,ఉపసర్పంచ్ మాధురి, వార్డ్ సభ్యులు నరేష్, నర్సారెడ్డి, సౌమ్య, దివ్య,లత ,వెంకటేష్.,పంచాయతీ కార్యదర్శి మౌనిక , మహిళా సంఘ అధ్యక్షులు నర్సక్క, లక్ష్మి,పల్లె డాక్టర్ అనూష, అంగన్వాడీ టీచర్స్ భాగ్య, శిరీష, పద్మ వి ఓ ఎ. హారిక, సురేష్, ఆశ వర్కర్స్ హేమ లత, లత, జల, కారోబార్ కిరణ్ రెడ్డి మండల నాయకులు నక్కల రవీందర్ రెడ్డి,బాల ముకుందం ,ఏఈ రాజ మల్లయ్య, మాజీ సర్పంచ్ నాడెం రత్నమాల–శంకర్, ఎంబరి మారుతి, నీరటి గంగారెడ్డి,గ్రామ నాయకులు,ప్రజాప్రతినిధులు, మండల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





# తెర్లుమద్ది గ్రామంలో ప్రమాదకర డ్రైనేజీ సమస్యకు ముగింపు – సర్పంచ్ బైతి దుర్గమ్మ చొరవతో పరిష్కారం

ముస్తాబాద్, మార్చి 23 ( ప్రజా జ్యోతి ): తెర్లుమద్ది గ్రామంలో బాధవేణి నారాయణ ఇంటి సమీపంలో గత 10 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రమాదకర డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ సమస్య కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ముఖ్యంగా ఆ మార్గంలో వెళ్లే ట్రాక్టర్లు పలుమార్లు బోల్తా పడిన ఘటనలు చోటుచేసుకోవడంతో ప్రజల్లో భయం నెలకొంది. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బైతి దుర్గమ్మ దృష్టికి తీసుకువెళ్లగా, ఆమె వెంటనే స్పందించి పాలకవర్గంతో కలిసి సమస్యను పరిష్కరించే చర్యలు చేపట్టారు. త్వరితగతిన డ్రైనేజీ పనులు పూర్తి చేయడంతో అక్కడి ప్రజలకు ఉపశమనం కలిగింది.

సమస్య పరిష్కారంతో కాలనీ నివాసులు ఆనందం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ బైతి దుర్గమ్మ కి మరియు పాలకవర్గ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి పట్ల సర్పంచ్ చూపుతున్న చొరవను ప్రజలు ప్రశంసిస్తున్నారు.



# నేటి ధర్నాను విజయవంతం చేయండి

– జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు



**నేలకొండపల్లి, మార్చి 23 ప్రజా జ్యోతి:** నెలకొండపల్లి మండల స్థానిక ప్రాథమిక పాఠశాల సింగారెడ్డి పాలెం లో ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు ... మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వము విద్యకు కేటాయించిన, ఎబ్యస్త్రవ్, ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత దిగజార్చే విధంగా ఉందని ఆయన విమర్శించారు. ఇలాంటి బడ్జెట్ వల్ల ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కాకపోగా, పేదలకు, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకొరకు విద్యకు కనీసం 20 శాతం బడ్జెట్ కేటాయించాలని,విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అనేక పెండింగ్ సమస్యల సాధన కొరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ముందు ఈనెల 24వ తారీఖున ధర్నా నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలియజేసినారు. ఈ ధర్నా నిరసన కార్యక్రమంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చినారు.

**1. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 20% బడ్జెట్ ను కేటాయించాలి.**

**2. డీఎస్సీ 2003 టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.**

**3. ఉద్యోగులకు్రా=జ ది 01-07-2023 నుండి అమలు చేయాలి**

**4. 5 ణూ బకాయిలను వెంటనే చెల్లించాలి.**

**5. పెన్షనరీ ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలి.**

**6. 317 స్థానికత నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.**

**7. అన్ని జిల్లాలకు డీఈవో పోస్టులు మరియు శాశ్వత ఎంఈఓ పోస్టులను ఇవ్వాలి.**

**8. గురుకులాలలో శాస్త్రీయ టైం టేబుల్ ను విడుదల చేయాలి.**

**9. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు జీవితాన్ని వెంటనే చెల్లించాలి.**

**10. ఖ+దీఎ,ఖ=ూ, కాంట్రాక్టు ఉద్యోగులకు మూల వేతనం అమలు చేయాలి.**

**11. గిరిజన ఆశ్రమ స్కూళ్లలో పండిత వ్యాయామ పోస్టులను అప్ గ్రేట్ చేయాలి.**

ఇంకా విద్యారంగంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలి ఉన్నాయి వీటిని అన్నింటిని ప్రభుత్వము వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి రామారావు జిల్లా కౌన్సిలర్ కోటేశ్వరరావు రవి గణేష్ గోవిందరెడ్డి చైనా రమాదేవి శంకర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదాన్నికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి

– సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్



**నేలకొండపల్లి, మార్చి 23 ప్రజా జ్యోతి:** సామ్రాజ్య వాదానికి, మతోన్మాదాన్ని కి వ్యతిరేకంగా యువత ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 95 వ వర్ధంతిని ఏఐవైఫ్ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం కర్నాటి కృష్ణయ్య భవనం లో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాటి భాను ప్రసాద్ మాట్లాడారు.... భగత్ సింగ్ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దోపిడి వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు న్నారు. నేటి పరిస్థిలో ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు తమ అధిపత్యాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని, కార్పొరేట్ దోపిడీ ప్రజలపై ప్రారంభిస్తుందని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న మతోన్మాద శక్తులు ప్రజలను మతాల పేరుతో విభజించి సామాజిక ఐక్యతను దెబ్బతీస్తున్నాయని తెలిపారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాంతరంగిక భద్రత, రక్షణ కు విగాథం కలిగించే విధంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించి దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, భవిష్యత్ తరాలకు ఉపాధి అవకాశాలు లేకుండా మళ్లీ సామ్రాజ్యవాద కబంధహస్తాలకిందకి దేశాన్ని నెట్టివేస్తున్నారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాధాన్ని గడగడలాడించిన విప్లవ వీర కిశోరం భగత్ సింగ్ స్ఫూర్తితో బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, ఏఐవైఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, ఏఐవైఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, సిపిఐ టౌన్ నాయకులు కాశబోయిన అయోధ్య, ఎస్ కే. సలాం, బి. మాధవరావు ఏఐవైఫ్ మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన

# మేనిఫెస్టోలో మాటను నిలబెట్టు కుంటా: చింతలపూడి శ్రావణి

– మా ఆదర్శ నాయకుడు కాసాని ఐలయ్య చింతలపూడి సాయి – మినరల్ వాటర్ ప్లాంటు శంకుస్థాపన

– దేగలమడుగు, లక్ష్మకపేటకి మంచినీరు సమస్య లేకుండా చేస్తాను: చింతలపూడి శ్రావణి

**సుజాత నగర్ ప్రజాజ్యోతి మార్చ్ 23:** కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21 వ డివిజన్ లో గల దేగలమడుగు, లక్ష్మక్కపేట గ్రామాలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను గుర్తించి ఎన్నికల హామీల్లో భాగంగా ఇరు గ్రామాలకు కలిపి దేగలమడుగు గ్రామంలో సురక్షిత మంచినీటి మినరల్ వాటర్ ప్లాంటు ను, చింతలపూడి శ్రావణి మామ స్వర్గీయ చింతలపూడి రామారావు పేరు మీద నిర్మించుటకు భూమి పూజా కార్యక్రమం 21 వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు చింతలపూడి సాయి కుమార్ - శ్రావణి చేతుల మీదుగా నిర్వహించారు. శ్రావణి మాట్లాడుతూ 21 వ డివిజన్ లో ఇచ్చిన మాట ప్రకారం వాటర్ ప్లాంట్ నిర్మిస్తున్నామని,ఈ డివిజన్ లో ఎటువంటి సమస్య ఉన్న నా దగ్గరికి తీసుకొని రండి అని అన్నారు.మా ఆదర్శ నాయకుడు కాసాని ఐలయ్య, పేదలు పడే కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడేవారు అని మన ప్రాంతంలో పేద ప్రజలు లేకుండా ఉండేలా సుజాత నగర్ మండలం ఉండాలి అని చాలా సార్లు అన్నారు, ఇప్పుడు ఆయన మార్గం లో నేను నిలబడి అన్ని విధాలుగా పేద ప్రజలకి తోడు ఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మాజీ సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు గారు, సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేశ్ గారు, కాంగ్రెస్, సీపీఎం శ్రేణులు, దేగలమడుగు , లక్ష్మక్కపేట ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గెలిచిన నెలలోనే ఎన్నికల హామీ నెరవేర్చుటకు శ్రీకారం చుట్టిన కార్పొరేటర్ దంపతులను అందరు ఇన్ని సంవత్సరాలనుండి ఎవరు ఇచ్చిన మాట నిలబెట్టు కోలేదు. అతి త్వరగా ఇచ్చిన మాట నిలబెట్టు కున్నందుకు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,వ్యాపారస్తులు, ప్రజలు అభినందించి వారి మంచినీటి సమస్య త్వరితగతిన పరిష్కరించిన కార్పొరేటర్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

# నేడు కలెక్టరేట్ ఎదుట టీపిటిఎఫ్ నిరసన

– టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్



**టేకులపల్లి,మార్చి23, ప్రజాజ్యోతి :**తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలనే ప్రధాన డిమాండ్స్ తో పాటు ఉపాధ్యాయుల ఇతర ఆరు డిమాండ్ల సాధన కొరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం (ఐడిఓసి)ఎదుటమంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించబోయే నిరసన ప్రదర్శనకు ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికై అధికార పార్టీ మేనిఫెస్టోలోని విద్యారంగానికి 20% నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.పిఆర్సి ఫిట్మెంట్ను వెంటనే ప్రకటించి బడ్జెట్లో నిధులు కేటాయించాలని, రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ ప్రయోజనాలను ఏక మొత్తంలో ఒకేసారి విడుదల చేయాలి. అలాగే సిపిఎస్ ను రద్దు చేయాలని,2003 డిఎస్సి టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, టీచర్ల పెండింగ్ బిల్లులు,పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.విద్యా రంగంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయ వ్యవస్థను రద్దు చేయాలి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.రామా రావు,కె.ఎర్రయ్య,బి.వీరన్న, ఎం.శ్రీనివాసరావు, కె.బిక్షమ య్య,ఎం.రాంబాబు, కె.రమేష్,బి.శ్రీవాణి, జానయ్య పాల్గొన్నారు.

# సంత వేలం రూ.13.50 లక్షలు



**టేకులపల్లి,మార్చి23,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించు సంత వేలం పాట 13లక్షల 50వేలు పలికింది. గోలియాతండా గ్రామపంచా యతీ కార్యాలయంలో టేకులపల్లి, గోలియా తండా ఉమ్మడి గ్రామపంచాయతీల సంత వేలంపాటను ఎంపీఓ జక్కుల గణేష్ గాంధీ, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్,గోలియా తండ సర్పంచ్ లకావత్ నాకా నాయక్ ఆధ్వర్యంలో సోమవారం సంత వేలం పాట నిర్వహించారు.ఈ సంత వేలం పాట ఓరా ఓరిగా జరిగిన వేలం పాట 13లక్షల 50వేల రూపాయాలకు మూడ్ వాసు సొంతం చేసుకున్నట్లు మండల పంచాయితీ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి శోభన్ , గోలియాతండా పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్,వార్డు మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి భద్రాచలంలో

# ప్రత్యేక ప్రధమ చికిత్స కేంద్రాల ఏర్పాటు

– డిఎం అండ్ హెచ్ఓ తుకారం రాథోడ్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 23 ,ప్రజా జ్యోతి:** ఈనెల 27న భద్రాచలం పుణ్యక్షేత్రంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ తెలిపారు, సోమవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారని, వేసవికాలం కారణంగా కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన తక్షణమే ప్రథమ చికిత్స కేంద్రాలను సంప్రదించాలని ఆయన కోరారు, అనంతరం నూతనంగా నియమితులైన ప్రోగ్రాం ఆఫీసర్లను పరిచయం చేసుకొని అభినందించారు, కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ రవిబాబు జిజిహెచ్ ఆర్ ఎం ఓ డాక్టర్ సత్య చైతన్య, డాక్టర్ సాయి కళ్యాణ్ ప్రోగ్రాం ఆఫీసర్, పీవోఎం హెచ్ ఎన్ డాక్టర్ చైతన్య డాక్టర్ రాకేష్, పి ఓ సి హెచ్ ఐ డాక్టర్ ప్రతాప్ , ఐడిఎస్పి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి డ , ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్ సిడి డాక్టర్ మధువరన్, డాక్టర్ హరీష్ ప్రోగ్రాం ఆఫీసర్ పి సి పి ఎన్ డి టి,మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్పందన డాక్టర్ రాందాస్ పాల్గొన్నారు.



## కోతుల బెడదను

# తొలగించిన మందపాటి



**సత్తుపల్లి మార్చి23(ప్రజా జ్యోతి)** పట్టణంలోని 21 వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన, మందపాటి ప్రభాకర్ రెడ్డి వార్డులోని కోతులు విపరీతంగా వార్డు ప్రజలకు ఆటంకం కలిగించడంతో, సోమవారం సుమారు 100 పైగా కోతులను పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డ్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు గురి చేయడంతో,వారి సమస్యలను తీర్చేందుకు ఈ విధంగా కోతులు పట్టించి ప్రజల ఇబ్బందులు తీర్చానని అన్నారు.

## లిటిల్ ఛాంప్స్

# ఒలంపియాడ్‌లో టాలెంట్ విద్యార్థుల ప్రతిభ



**సత్తుపల్లి మార్చి23 (ప్రజా జ్యోతి)** లిటిల్ ఛాంప్స్ ఎడ్యుకేషన్ అకాడమీ వారు నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ ఆరవ తరగతి విద్యార్థి షేక్ హనీఫ, ఏడవ తరగతి విద్యార్థి నక్క జోష్ విత్ చరణ్, 8వ తరగతి విద్యార్థి షేక్ ఆస్పియా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్,ప్రశంస పత్రం బహుమతిగా అందుకున్నారు.అదేవిధంగా సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో సావర్కర్, హాసిని, ఆస్పియా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి,గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు.అదేవిధంగా మ్యాథ్స్ ఒలంపియాడ్ లో ఆరవ తరగతి విద్యార్థి షీమా, సావర్కర్, ఏడవ తరగతి విద్యార్థి జోషిత ఉమాశ్రీ, 8వ తరగతి విద్యార్థి షేక్ ఆసిఫియా రాష్ట్రస్థాయిలో ర్యాంకుల సాధించి గోల్డ్ మెడల్ మరియు ప్రశంస పత్రం అందుకున్నారు.ఒలంపియాడ్ ఎగ్జామ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వందమంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందుకోవడం జరిగింది. విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులను టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ , స్కూల్ ఇంచార్జ్ శంకర్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థిలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి

# పిలుపు కమలానాథుల అరెస్ట్



**చింతకాని మర్చి 23ప్రజా జ్యోతి** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యువత ప్రజానీకాన్ని మోసం చేసి గద్దె నొక్కి ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా, మోసానికి గురి చేస్తున్న కాంగ్రెస్ రేవంత్ సర్కార్ మెడలోంచే దిశగా చలో అసెంబ్లీ ముట్టడి పిలుపునివ్వడం జరిగింది. ముందస్తు రాత్రి 1 గంటల10 నిమిషాలా ప్రాంతంలో చింతకాని పోలీసు వారు చింతకాని బిజెపి మండల అధ్యక్షులు కొండా గోపి, ప్రధాన కార్యదర్శి గోదా మంగయ్య, సీనియర్ నాయకులు కోరిపెల్లి శ్రీను లని ఇంటికి వచ్చి అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది.ఇలాంటి అరెస్టులు ఎన్ని చేసినా భారతీయ జనతా పార్టీ తెలంగాణలో కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టడంలో భారతీయ జనతా పార్టీ రానున్న రోజుల్లో ఉవ్వెత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగించడం తధ్యం. అదేవిధంగా తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం దిశగా పోరాటాలు చేస్తుంది.

## ప్రజావాణి దరఖాస్తుకు అధికారుల తక్షణ

# స్పందన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయింపు

– పేద కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా అధికార యంత్రాంగం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గత ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుపై అధికారులు స్పందించి, మానవీయ కోణంలో చర్యలు చేపట్టారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటకు చెందిన రాయల రమేశ్, సులోచన దంపతులు 20 ఏళ్ళ క్రితం ఖమ్మం నగరానికి వలస వచ్చారని, వీరి చిన్న కుమారుడు అజయ్ (18) మెదడు ఎదుగుదల లోపించి మంచానికే పరిమితమయ్యాడని, తమకు సొంత ఇల్లు లేని కారణంగా కిరాయి ఇండ్లు లభించక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు దరఖాస్తు చేసుకోవడం జరిగింది.ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, ఆ కుటుంబం నివాస సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు.దీనిపై స్పందించిన అధికారులు, ఆ కుటుంబానికి తక్షణ ఉపశమనం కలిగించేలా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించారు. ఇట్టి విషయంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అల్లిపురంలోని డబుల్ బెడ్ రూంల సముదాయంలో బ్లాక్ నెంబర్ 5 నందు జి7 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తూ ఉత్తర్వులను రమేష్-సులోచన దంపతులకు సోమవారం అందజేశారు. జిల్లా పరిపాలన తక్షణ స్పందనతో ఆ కుటుంబానికి నూతన ఆశలు కలిగినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలపై జిల్లా యంత్రాంగం చూపుతున్న చొరవకు ప్రజలు అభినందనలు తెలిపారు.



# చిన్నారికి ఆశీర్వచనాలు



**చింతకాని మర్చి 23ప్రజా జ్యోతి** లండన్‌లో నివాసం ఉంటున్న చిల్లంకూరి మోహన్ రావు ,మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన అంబటి సైదేశ్వర్ రావు, భద్రమ్మ ల కూతురు వాణి ల చిన్న కుమారుడు దేవాన్ష్ పెనుగ్రంచిప్రోలు లో జరిగిన పుట్టు వెంట్రుకల వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన నాగులవంచ గ్రామస్తులు వంకాయలపాటి సత్యనారాయణ, సుజాత, అంబటి శాంతయ్య, చావా అరుణ్ కుమార్,ఆలిస్యం బసవయ్య, అంబటి సత్యనారాయణ, కొమ్మినేని వెంకటేశ్వరరావు, సామినేని బాబురావు, అంబటి లచ్చయ్య,చల్లా పురుషోత్తం, మండేపూడి మదన్, నల్లమోతు ప్రభాకర్, నెల్లూరి రమేష్, నన్నకఅప్పారావు, గువ్వల విరదాస్, చింతనిప్పు నరసింహారావు, ముప్పిడి వెంకటేశ్వర్లు, ఇమ్మడి కాశయ్య , తోటకూరి చిన్న, గింజుపల్లి బాలకృష్ణ, ఆలస్యం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సంత అభివృద్ధికి తోడ్పడండి: స్థానికుడు



**టేకులపల్లి,మార్చి23,ప్రజాజ్యోతి :**మండలంలోని ఉమ్మడి పంచాయతిలా వారపు సంత ఆదాయం అభివృద్ధికి వాడాలని, ఆదాయం ఉన్నా కూడా వారసంత నిర్వహణ, వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గోలియా తండా పంచాయతీ శ్రీ కోదండ రామాలయ సమీప స్థానికుడు ఆరోపించారు. కోదండ రామాలయాన్ని సంత ఆవరణను అభివృద్ధి చేయాలని గోలియా తండ స్థానికుడు మండల అధికారులను కోరారు.ప్రతి శనివారం కోదండ రామాలయ ప్రాంగణంలో నిర్వహించి రహదారి పక్కనే నిర్వహించే సంతలో ఎలాంటి వసతులు లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిచి పోతున్నామని విక్రయదారులు వాపోతున్నారు. సంతలో ఉన్న భూమి వివాదాల్లో ఉందని, దానిని పరిష్కారం చేయాలని కోదండ రామాలయ సమీప స్థానికుడు కోరారు. దీనిపై అధికారులు , సర్పంచులు గ్రామపంచాయతీ కార్యాలయంలో మాట్లాడదామని కమిటీలు ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# ప్రెస్ క్లబ్బా..? ప్రయివేటు క్లబ్బా..?

**అక్రమ వసూళ్లు – లెక్కలపై అనుమానాలు**
**తాళాలు కొద్దిమందికే.. ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరణ**
**కలెక్టర్ తక్షణ విచారణ చేయాలి**
**టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్-2843) డిమాండ్**

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి
ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న వ్యవహారాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి.జర్నలిస్టుల ఉమ్మడి వేదికగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్‌ను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని 'ప్రైవేట్ క్లబ్'లా నడుపుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్–2843) జిల్లా కమిటీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు టి.సంతోష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణలు లోకల్ బాడీస్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సభ్యత్వాల



పేరుతో రూ.1000 నుంచి రూ.3000 వరకు ఎటువంటి నిబంధనలు, రశీదులు లేకుండా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని నేతలు ఆరోపించారు.ఈ నిధులపై ఎటువంటి లెక్కలు,ఖాతాలు వెల్లడించకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు.ఇప్పటివరకు క్లబ్ నిధులపై ఆడిట్ నిర్వహించలేదని, లెక్కలు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ప్రెస్ క్లబ్ తాళాలు కూడా కొద్దిమంది వ్యక్తుల వద్దే ఉండటం, ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరించడం, వాట్సాప్ గ్రూపుల్లో ఇతర యూనియన్ ప్రతినిధులకు అడ్మిన్ హక్కులు ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని టిడబ్ల్యూజెఎఫ్ నేతలు తెలిపారు.ఇటీవలి కాలంలో జర్నలిస్టులను అడ్డుకోవడం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రెస్ స్వేచ్ఛపై నేరుగా దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ తక్షణం



జోక్యం చేసుకుని ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమ వసూళ్లపై ఆడిట్ నిర్వహించి లెక్కలు బహిర్గతం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ సమాన హక్కులు కల్పించాలని టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్–2843) నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, నగర అధ్యక్షులు గెంటేల కుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్,నాగకృష్ణ, శ్రీధర్,వెలిగొండ వెంకట్,రవి, మొగిలి నాగేశ్వర రావు,ఎం.ఎస్. చిన్ని, మామిడాల వీరబాబు, తానంగి భిక్షం, పాగ యోనా, తిరుపతి కొండలరావు,పి.శ్రీను, సవల భాగ్యరాజు,నీరుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు

నేరడిగొండ మార్చి 23( ప్రజా జ్యోతి):
స్థానిక హైస్కూల్‌లో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి




ముఖ్య అతిథిగా కుమారి వాటర్ ప్లాంట్ చైర్మన్ చంద్ర సోమరావు, గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడేపు రవి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ సోమరావు మాట్లాడుతూ, ప్రతి నీటి చుక్కా విలువైనదని, భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. సర్పంచ్ అగ్గిముల్ల గోదావరి–లస్మన్న, మరియు ఉపసర్పంచ్ రవి మాట్లాడుతూ, గ్రామంలో నీటి వనరుల రక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయులు మరియు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. నీటిని వృధా చేయమని, వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటామని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో కారోబార్ రాజు,చిలకయ్య, బ్రహ్మయ్య, శంభు, పూజిత్, వివేక్ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## హెల్మెట్ పెట్టుకొని తమ ప్రాణాలను కాపాడుకోండి

### ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్వర్లు

భువనగిరి,మార్చ్ 23(ప్రజాజ్యోతి)
భువనగిరి పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద యాదాద్రి జిల్లా



ఎస్పీ,ఆదేశాల మేరకు,ట్రాఫిక్ పోలీసుల, ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్వర్లు మధుసూదన్ మాట్లాడుతూ ప్రజలు వాహనాలపై వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా,హెల్మెట్,వాడాలని అన్నారు. అదే విధంగా కారు లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అవగాహనా కల్పించారు.అలాగే హెల్మెట్ పెట్టుకోవడం వలన ఆక్సిడెంట్ లు జరిగినప్పుడు తల సేఫ్ గా ఉంటుందని.. పెద్ద ప్రమాదం నుండి హెల్మెట్ కాపాడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ వాడాలని.. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ కేశవ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ అయ్యుబ్, కానిస్టేబుల్ పూర్ణ చందర్ ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పసునూర్ జడ్పిహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడు హరికిషన్‌కు ఘన సన్మానం

నాగారం మార్చ్23 ప్రజా జ్యోతి:
పద్మశ్రీ డా. కూరెళ్ళ విఠలాచార్య స్వగ్రామం వెల్లంకిలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో ప్రతిభ కనబర్చిన జడ్పిహెచ్ఎస్ పసునూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు డా. వై. హరికిషన్‌కు పాఠశాలలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ కవి సమ్మేళనంలో



డా. హరికిషన్ తన సీస పద్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకుని, పద్మశ్రీ డా. విఠలాచార్య చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిభకు ప్రశంసలు వెల్లువెత్తాయి.ఈ విజయాన్ని పురస్కరించుకొని పసునూర్ జడ్పిహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు బత్తిని విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని డా. హరికిషన్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, హరికిషన్ సాధించిన ఈ గౌరవం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..

మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు.

# గ్యాస్ సిలిండర్ లతో నిరసన

ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:
ఎల్బీనగర్ చౌరస్తా వద్ద టిఆర్ఎస్ శ్రేణులు కాళీ సిలండర్లతో నిరసన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం – కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నేపం వేసుకుంటూ ఆడుతున్న ఈ దొంగనాటకాల వల్లే ఈరోజు గ్యాస్ కొరత పరిస్థితి ఏర్పడిందని ఎల్.బి.నగర్ నియోజకవర్గ సీనియర్ భారస నాయకులు ఆరోపించారు.దానిలో భాగంగా ఈ రోజు ఎల్.బి.నగర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు భారస నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మాత్రం "గ్యాస్ సప్లై ఎక్కడా ఆగలేదు, అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి" అంటోంది. రాష్ట్ర ప్రభుత్వం అయితే "కేంద్రం నుంచి సరైన సరఫరా లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయి" అని చెబుతోంది.ఈ ఇద్దరి పరస్పర ఆరోపణల మధ్యలో సామాన్య ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారు.రోజువారీ జీవనంపై ఆధారపడే ఆటో డ్రైవర్లు, టిఫిన్ సెంటర్ యజమానులు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ వంటి అనేక వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇలాంటి పరిస్థితిలో, గ్యాస్ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అమ్మడం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది నిజమైతే, అది పూర్తిగా అన్యాయం. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, సరఫరా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, బాధ్యత వహించడం ప్రభుత్వాల బాధ్యత. అవసరమైన చోట బాధ్యత తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఐదు రాష్ట్రాల (అస్సాం, తమిళనాడు, వెస్ట్ బెంగాల్, పాండిచేరి, కేరళ) ఎన్నికల నేపథ్యంలో కేవలం 50 రూపాయలు మాత్రమే పెంచడం జరిగింది. ఈ ఎన్నికల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పైన ధరలు పెంచితే రాబోయే ఎలక్షన్లో ఇబ్బంది కరమైన పరిస్థితి వస్తుంది అని ఎలక్షన్స్ తరువాత డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ ల పైన భారీగా రేట్లు పెంచనున్న కేంద్ర ప్రభుత్వం.ఎన్నికలు అయిపోయిన వెంటనే మరో 50 రూపాయలు పెంచే యోజనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ఈ దొంగనాటకాలలో సామాన్య ప్రజలే నష్టపోతున్నారు.ఇట్టి కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు,సీనియర్ భారస నాయకులు,డివిజన్ పరిధిలోని అధ్యక్షుళ్ళు,మహిళా అధ్యక్షురాళ్ళు, ఉద్యమకారులు,పలు విభాగాల కమిటీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,మహిళలు, కార్యకర్తలు,పార్టీ అభిమానులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి,చెరుకు సంగీత




ప్రశాంత్ గౌడ్,జిట్టా రాజశేఖర్ రెడ్డి,పద్మ శ్రీనివాస్ నాయక్,సామ తిరుమల రెడ్డి,భవాని ప్రవీణ్ కుమార్,జిన్నారం విఠల్ రెడ్డి,సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ యువజన అధ్యక్షులు రవిముదిరాజ్,మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయిడు,డివిజన్ల అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,సత్యం చారి,వరప్రసాద్ రెడ్డి,లింగాల రాహుల్ గౌడ్,చింతల రవికుమార్,శ్రీధర్ గౌడ్,రాజిరెడ్డి,జక్కిడి మల్లారెడ్డి,చిరంజీవి,శ్రీశైలం యాదవ్,రోజారెడ్డి మరియు పలువురు ఉద్యమకారులు, నాయకులు,మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించండి

మొదటిపేజీ తరువాయి..

ఉంటాము. ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## దానం నాగేందర్ వ్యవహారంపై విచారణ

మొదటిపేజీ తరువాయి..

మారిన వ్యవహారంలో స్పీకర్ తీర్పును కొట్టివేయాలని ఏలేటి పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన దానం నాగేందర్.. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని న్యాయస్థానం దృష్టికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీసుకొచ్చారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## నేడు ప్రపంచ టిబి దినోత్సవం

మొదటిపేజీ తరువాయి..

24న మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించబోతున్నారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంతి,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని,డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మూడు నిముషాలకు ఇద్దరు వ్యక్తులు టిబి కారణంగా చనిపోతున్నారని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని, ప్రజలు చైతన్యం కావాలని నాపా ప్రతినిదులు సూచించారు. టిబికి ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ఇది క్యూరబుల్ అని అన్నారు. ప్రపంచ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది క్షయవ్యాధి బారినపడుతున్నారని అన్నారు.ఏళ్ళ తరబడి క్షయవ్యాధి అనేది వైద్యపరమైన చిక్కులు, సామాజిక మరియు ఆర్థిక ఇబందులు చూపుతుందని అన్నారు. ఈ క్షయవ్యాధి ప్రపంచ మరణానికి ప్రధాన కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. వాడుక భాషలో టిబిగా పిలిచే క్షయ వ్యాధి వల్ల ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యుబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలన్నారు. తాము నిర్వహించే వాకథాన్ ప్రజల్లో చైతన్యం కలిగిస్తే అంతకు మించిన లక్ష్యం మరోటి లేదన్నారు.



## తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

మొదటిపేజీ తరువాయి..

పొడిగింపు అంశంపై విచారణను మంగళవా రానికి వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని, అయితే ఆ తేదీకి ఆంధ్రప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45



కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎన్ఎంసీ నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదని కోర్టుకు న్యాయవాదులు చెప్పారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967